STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 132 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 27 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

పార్లమెంట్‌లో కీలక ఘట్టానికి తెర!



- ఈ నెల 30న లోక్‌సభ.. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ
- లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచే ప్రతిపాదన?

4

వ్యాపారులకు ఊరట

- ఇక క్షణాల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దు..
- డిసెంబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలు
- అధికారుల ప్రమేయం లేకుండానే ఆటోమేటిక్ రద్దు



4

మొబైల్ ఫోన్లు, మైకులు పట్టుకున్న వారు

జర్నలిస్టులు కాదు..

- జర్నలిస్టులు, రీల్ క్రియేటర్ల మధ్య తేడాపై సుప్రీం విచారణ..
- వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులకు భద్రతపై దృష్టి
- జర్నలిస్టులపై దాడుల ఆరోపణల విచారణకు ఉన్నతస్థాయి కమిటీ

4







పల్లె పోరులో కూటమి ప్రభంజనం

- తొలిదశ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ హవా
- రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రలో మెజార్టీ పీఠాలు కైవసం
- అన్నమయ్య, తిరుపతి, పల్నాడు, ప్రకాశంలో ఏకపక్ష ఫలితాలు
- గోదావరి జిల్లాల్లో పోటాపోటీ.. అయినా కూటమిదే పైచేయి



ప్రశాంతంగా ముగిసిన మినీ పురపోరు

4 కార్పొరేషన్లు, 19 పురపాలికల్లో పోలింగ్.. 30న కౌంటింగ్

- మంగళగిరిలో దొంగ ఓట్ల కలకలం.. రాజమహేంద్రవరంలో ఉద్రిక్తత
- విలీనంపై నిరసనగా అల్లూరులో నాలుగు వార్డుల బహిష్కరణ


నవభారత్

శ్రీవారి సేవలో చంద్రబాబు

- సతీసమేతంగా పాల్వంచ ఆలయ దర్శనం
- నేటి సుదర్శన హోమంలో భువనేశ్వరి
- దర్శనం అనంతరం ఉండవల్లికి ఏపీ సీఎం

2





శ్రీవారికి రూ.206 కోట్ల అపూర్వ కానుక

కిరీటం, కౌస్తుభం, శంఖచక్రాలతో 46 ఆభరణాలు

- 238 క్యారెట్ల వజ్రాలు, 2,247 క్యారెట్ల నీలమణులు
- వజ్రాలు, కెంపులు, సాలగ్రామాలతో అద్భుత రూపకల్పన
- రంగనాయకుల మండపంలో నగల ప్రదర్శన, వీక్షణ
- శ్రీవారికి 106 కిలోలు.. అమ్మవారికి 15 కిలోలు
- వజ్రాలు, నీలమణులతో 33 రకాల నగల తయారీ

2

121 కిలోల బంగారు, వజ్రాభరణాల సమర్పణ

చెన్నై జైన్ దంపతుల అపూర్వ దాతృత్వం

డబ్బు శాశ్వతం కాదు.. సేవలోనే అసలైన ఆనందం

మానవ సేవే మాధవ సేవగా పనిచేయాలి

దాతలతో కలిసి సీఎం చంద్రబాబు మీడియా భేటీ

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో గురువారం ఓ అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టం ఆవిష్కృతమైంది. విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి భక్తి పరంపరను తలపిస్తూ చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు స్వామివారికి ఏకంగా రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొనగా, టీటీడీ అర్చకులు, అధికారులు ఈ స్వర్ణ కానుకను స్వీకరించారు. డబ్బు, సంపద, హోదా ఎప్పటికీ శాశ్వతం కాదని.. ఆధ్యాత్మికత, ధర్మం, సేవా భావమే మనిషికి అసలైన సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తాయని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచంలో ఎంతోమంది బిలియనీర్లు, ట్రిలియనీర్లు ఉన్నా సంపాదించిన సంపదను సద్వినియోగం చేసుకునే అదృష్టం కొందరికే దక్కుతుందన్నారు. దైవాజ్ఞతోనే ఈ భారీ కానుకను అందించిన జైన్ దంపతులు అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడిన ఆయన.. 'మానవ సేవే మాధవ సేవ' అనే స్ఫూర్తితో ఇతర సంపన్నులూ పేదల సంక్షేమం, ఆధ్యాత్మిక సేవలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

- తిరుమల, నవంబర్ 26 (సమయం న్యూస్):

వివరాలు 2 లో



పోలింగ్ సరళిని పరిశీలించిన ఎస్ఈసీ పునేఠా

3

స్థానిక పోరులో యథేచ్ఛగా రిగ్గింగ్!

2

- మంగళగిరి, రాయచోటి, గురజాలలో అక్రమాలు
- రాప్తాడులో 200 బ్యాలెట్ పత్రాల అపహరణ
- ఎస్ఈసీ స్పందించకపోతే న్యాయపోరాటమన్న వైఎస్సార్‌సీపీ

రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ, రెండో దశ మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులు, అధికారుల సహకారంతో కూటమి నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీని కలిసి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం నలమారు చంద్రశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.



నంది అవార్డులకు గ్రీన్ సిగ్నల్

- 2017-2025 తొమ్మిదేళ్ల పురస్కారాలు ఒకేసారి
- సినిమా, టీవీ, నాటక రంగాల ఎంపికకు ఉత్తర్వులు
- డిసెంబర్‌లో అమరావతి లేదా విజయవాడలో వేడుకలు

8




రాయలచెరువు వద్ద ఘోర ప్రమాదం.. నలుగురి మృతి

3

నేషనల్ ఫిల్మ్స్ అవార్డుల జ్యూరీ చైర్మన్‌గా బాలకృష్ణ

- 2025 పురస్కారాల ఎంపికకు ఏపీ ప్రభుత్వ కమిటీ
- సభ్యులుగా అల్లు అరవింద్, గోపాల్‌రెడ్డి, ప్రభ
- కన్వీనర్‌గా ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ ఎండీ నియామకం

3





నవభారత్ శ్రీవారి సేవలో చంద్రబాబు

సతీసమేతంగా పాల్వంచ ఆలయ దర్శనం

నేటి సుదర్శన హోమంలో భువనేశ్వరి

దర్శనం అనంతరం ఉండవల్లికి ఏపీ సీఎం

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో సందడి నెలకొంది. తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో పాల్వంచకు చేరుకున్న చంద్రబాబు, తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి నవభారత్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో రెండు రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దర్శనం, పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్‌లో అమరావతిలోని ఉండవల్లి నివాసానికి తిరుగుపయనమయ్యారు. నవంబర్ 27న జరిగే సుదర్శన హోమంలో పాల్గొనేందుకు నారా భువనేశ్వరి పాల్వంచలోనే బస చేయనున్నారు.

కిరీటం, కౌస్తుభం, శంఖుచక్రాలతో 46 ఆభరణాలు

238 క్యారెట్ల వజ్రాలు, 2,247 క్యారెట్ల నీలమణులు

వజ్రాలు, కెంపులు, సాలగ్రామాలతో అద్భుత రూపకల్పన

రంగనాయకుల మండపంలో నగల ప్రదర్శన, వీక్షణ

శ్రీవారికి 106 కిలోలు.. అమ్మవారికి 15 కిలోలు

తిరుచానూరు అమ్మవారికి 15 కిలోలతో స్వర్ణ వస్త్రం

వజ్రాలు, నీలమణులతో 33 రకాల నగల తయారీ




తిరుమల, నవంబర్ 26 (సమయం న్యూస్) : తిరుమల శ్రీవారి చరిత్రలో చారిత్రాత్మక విరాళంగా నిలిచేలా చెన్నైకి చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు రూ.207.60 కోట్ల విలువైన 121 కిలోల బంగారు ఆభరణాలను గురువారం శ్రీవేంకటేశ్వర స్వామివారికి సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ విరాళాన్ని అందజేశారు. శ్రీవారి దర్శనం అనంతరం సీఎం చంద్రబాబు, దాత దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయకుల మండపంలో ప్రదర్శించిన 46 బంగారు ఆభరణాలను వీక్షించి, దాతల ఉదారతను అభినందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు తలపై ఆభరణాల పళ్లాలను ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, శ్రీవారి సన్నిధికి చేరుకుని స్వామివారి ఎదుట సమర్పించి పూజలు చేశారు.

బంగారం, విలువైన రాళ్ల వివరాలు

దాతలు సమర్పించిన మొత్తం 121 కిలోల (24 క్యారెట్లు) బంగారంలో 33 రకాలకు చెందిన 46 ఆభరణాలు ఉన్నాయి. తయారీ ఖర్చులతో కలిపి వీటి మొత్తం విలువ రూ.207.60 కోట్లు. ఇందులో శ్రీవారి ఆభరణాల తయారీకి 106 కిలోల (24 క్యారెట్లు) బంగారాన్ని వినియోగించగా, మిగిలిన 15 కిలోల బంగారంతో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని తయారు చేయనున్నారు. ఈ ఆభరణాల్లో 238.2 క్యారెట్ల వజ్రాలు, 2,247.7 క్యారెట్ల నీలమణులు, 91.6 క్యారెట్ల పసుపు నీలమణులు, 84.2 క్యారెట్ల కెంపులు, పచ్చలతో పాటు 2,916.5 గ్రాముల సాలగ్రామ రాళ్లను పొదిగారు.

సమర్పించిన 33 రకాల ఆభరణాలు

విరాళంగా అందజేసిన 46 ఆభరణాల్లో పాద కవచములు (2), అందెలు (2), పాగడ, తులసిపత్ర హారము, అష్టోత్తర శత కాసుల మాల, చతుర్భుజ లక్ష్మీ హారము, పులిగోరు, అష్టోత్తర పత్ర హారము, సాదా వడ్డాణము, గంటల మొలత్రాడు, సూర్య కంఠి, కౌస్తుభం, శ్రీవత్సం, మొలచేయి, కటి హస్తము పై రేకు, నాగాభరణ వడ్డాణము, గొలుసు, అభయ చేతుల కంకణాలు (5), చంద్ర వంక కంఠి, వైకుంఠ హస్తము, కరి హస్తము, నాగాభరణ కడియములు (2), నాగాభరణములు (2), భుజకీర్తులు (2), కర్ణ పత్రములు (2), బాహువులు (2), రెండు భాగాలుగా ఉన్న శాలిగ్రామ హారములు (2), రెండు భాగాలుగా ఉన్న కమలం త్రపు శాలిగ్రామ హారములు (2), నీమ కవచముల మోపుగల యజ్ఞోపవీతం, శంఖము కవచము, చక్రము కవచము, ముక్కుపుడి, కిరీటము ఉన్నాయి.







శ్రీవారికి రూ.206 కోట్ల అపూర్వ కానుక

- **121 కిలోల బంగారు, వజ్రాభరణాల సమర్పణ**
- **చెన్నై జైన్ దంపతుల అపూర్వ దాతృత్వం**
- **సేవలోనే అసలైన ఆనందం**
- **మానవ సేవే మాధవ సేవగా పనిచేయాలి**
- **దాతలతో కలిసి సీఎం చంద్రబాబు మీడియా భేటీ**

తిరుమల, నవంబర్ 26 (సమయం న్యూస్): తిరుమల శ్రీవారి సన్నిధిలో గురువారం అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు స్వామివారికి రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొనగా, టీటీడీ అర్చకులు, అధికారులు ఆభరణాలను స్వీకరించారు. అనంతరం దాతలతో కలిసి తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. డబ్బు, సంపద, హోదా ఎప్పటికీ శాశ్వతం కాదని, ఆధ్యాత్మికత, ధర్మం, సేవా భావమే మనిషికి అసలైన సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తాయని అన్నారు. ప్రపంచంలో ఎంతోమంది బిలియనీర్లు, ట్రిలియనీర్లు ఉన్నా సంపాదించిన సంపదను సద్వినియోగం చేసుకునే అదృష్టం కొందరికే దక్కుతుందన్నారు. ఆ కోవలోనే నిలిచి అపూర్వ దాతృత్వాన్ని చాటిన జైన్ దంపతులు అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ అపూర్వ ఘట్టంలో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని సీఎం తెలిపారు. ప్రతిరోజూ శ్రీవారికి 120 కిలోల బంగారు ఆభరణాలు అలంకరిస్తారని, దేవుని ఆదేశంతోనే 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించామని జైన్ దంపతులు చెప్పడం వారి భక్తికి నిదర్శనమన్నారు. పూర్వం పల్లవ, చోళ, చేర, పాండ్య రాజులతో పాటు మైసూర్, మరాఠా రాజులు ఆలయాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు శ్రీవారికి రత్నకిరీటం, పీతాంబరం సహా ఎన్నో ఆభరణాలు సమర్పించారని, ఆనాటి నుంచి నేటి జైన్ దంపతుల వరకు స్వామివారిపై భక్తి పరంపర పెరుగుతూనే ఉందని చెప్పారు.

మానవ సేవే.. మాధవ సేవ

దేవునిపై భక్తి ఉన్న ప్రతి ఒక్కరూ 'మానవ సేవేఉమాధవ సేవ' అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం పనిచేసే వారే దేవునికి అత్యంత సన్నిహితంగా ఉంటారన్నారు. జైన్ దంపతుల తరహాలోనే ఇతర సంపన్నులూ ముందుకు వచ్చి పేదల సంక్షేమం, సమాజ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో టీటీడీ సహకారంతో 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టబోతున్నామని, దేశంలోని అన్ని రాజధానులతో పాటు విదేశాల్లో హిందువులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఆలయం ఉన్న ప్రతిచోటా ప్రశాంత, పవిత్ర వాతావరణంతో పాటు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. 'ప్రాణదానం' ద్వారా వైద్య సేవలు, 'విద్యాదానం' కింద ప్రత్యేక నిధితో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తామని సీఎం తెలిపారు. ఎల్ నినో వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'వృక్షో గోవిందం' పేరుతో పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపడతామన్నారు. భవిష్యత్తులో తిరుమలకు నీటి ఎద్దడి లేకుండా హంద్రీఉనీవా ద్వారా కల్యాణి డ్యాంకు, సోమశిల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని, అవసరమైతే తిరుమలకు రెండో పైప్‌లైన్ వేస్తామని స్పష్టం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌తో పాటు భగవంతుని కృప ఉండటం వల్లే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

నమ్ముకున్న వారికి శ్రీవారి అండ

పూర్వకాలంలో అనేక దేవాలయాలపై దాడులు జరిగినా వేంకటేశ్వరస్వామి ఆలయం జోలికి వెళ్లే సాహసానికి ఎవరూ ఒడిగట్టలేదని ముఖ్యమంత్రి అన్నారు. కొలిచిన వారికి, నమ్మిన వారికి శ్రీవారు రక్షణగా నిలుస్తారని తన విషయంలోనే నిరూపితమైందన్నారు. 'ప్రాణదానం' ప్రారంభించిన రోజే తనపై అలిపిరిలో పకడ్బందీగా దాడి జరిగినా స్వామి కృప వల్లే ఎవరూ చనిపోలేదని, వేంకటేశ్వరస్వామే ప్రాణభిక్ష పెట్టి పునర్జన్మనిచ్చారని భావోద్వేగంతో నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. భక్తుల విరాళాలు, ఆదాయాన్ని పారదర్శకంగా వెల్లడిస్తూ ప్రతి రూపాయిని వారి సౌకర్యాలు, సేవలకే టీటీడీ ఖర్చు చేస్తోందన్నారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో రాజీ పడొద్దని, గోసంరక్షణ, వేద పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని టీటీడీకి సూచించారు. భక్తి విశ్వాసాలతో సేవలందిస్తున్న శ్రీవారి సేవకులను మరింత ప్రోత్సహించాలని నిర్దేశించారు. మీడియా సమావేశంలో టీటీడీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీఎం దంపతులు

- **భువనేశ్వరితో కలిసి స్వామివారిని దర్శించుకున్న చంద్రబాబు**
- **మహాద్వారం వద్ద ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం**
- **రంగనాయకుల మండపంలో వేదపండితుల ఆశీర్వచనం**



తిరుమల, నవంబర్ 26 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం తన సతీమణి భువనేశ్వరితో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, అర్చకులు సంప్రదాయ ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, ఈవో, అదనపు ఈవోలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యానికి బలం

- **ఉండవల్లిలో కుటుంబంతో కలిసి ఓటేసిన చంద్రబాబు, లోకేశ్**
- **మంగళగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న పవన్ కల్యాణ్**
- **డబ్బు ప్రభావం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి**
- **పోలింగ్ అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం పిలుపు**



అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్): మంగళగిరిఉతాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం ఉండవల్లిలోని 53వ డివిజన్ పాఠశాల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి ఓటు వేశారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 23 మున్సిపాలిటీలు, పంచాయతీలకు తొలిదశ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యం మరింత బలపడాలంటే బాధ్యత కలిగిన ప్రతి పౌరుడూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు లభిస్తుందని, పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఓటరూ పోలింగ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. భారత ప్రజాస్వామ్యం అత్యంత బలమైనదని, దేశం మరింత అభివృద్ధి చెందేందుకు సమర్థవంతమైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా ఓటు వేసే పరిస్థితి రావాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భారత్‌కు దిశానిర్దేశం చేసిందని, ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య ఆయుధాన్ని అందించారని కొనియాడారు.

మంగళగిరిలో ఓటేసిన డిప్యూటీ సీఎం పవన్

మంగళగిరిఉతాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహ కాలనీలో ఉన్న 34వ నంబర్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన.. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తూ సాధారణ ఓటర్లతో కలిసి వెళ్లి ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతగా ప్రతి పౌరుడూ తప్పనిసరిగా ఓటు వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం దేశ ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



పల్లె పోరులో కూటమి ప్రభంజనం

- తొలిదశ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ హవా
- రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రలో మెజార్టీ పీఠాలు కైవసం
- అన్నమయ్య, తిరుపతి, పల్నాడు, ప్రకాశంలో ఏకపక్ష ఫలితాలు
- గోదావరి జిల్లాల్లో పోటాపోటీ.. అయినా కూటమిదే పైచేయి



అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్): రాష్ట్రంలో తొలిదశ గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కూటమి మద్దతుదారులు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల వ్యాప్తంగా మెజార్టీ సర్పంచ్ పీఠాలతో పాటు వార్డుల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. ప్రధానంగా పలు జిల్లాల్లో ఫలితాలు ఏకపక్షంగా రావడంతో విజేతలు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

రాయలసీమలో ఏకపక్ష జోరు

రాయలసీమ జిల్లాల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు భారీ ఆధిక్యాన్ని సాధించారు. తిరుపతి జిల్లాలో 404 పంచాయతీలకు గాను 227 స్థానాల ఫలితాలు వెల్లడికాగా, టీడీపీ మద్దతుదారులు 172, జనసేన 6, బీజేపీ 1, వైఎస్సార్‌సీపీ 39 చోట్ల విజయం సాధించాయి. అన్నమయ్యలో వెలువడిన 74 (మొత్తం 85) ఫలితాల్లో టీడీపీ ఏకంగా 72 పీఠాలను కైవసం చేసుకోగా, వైఎస్సార్‌సీపీ 2 స్థానాలకే పరిమితమైంది. కడప జిల్లాలో ప్రకటించిన 111 (మొత్తం 176) ఫలితాల్లో టీడీపీ 69, జనసేన 5, బీజేపీ 1, వైఎస్సార్‌సీపీ 31 చోట్ల గెలుపొందాయి. చిత్తూరులో వెల్లడైన 77 (మొత్తం 182) స్థానాల్లో టీడీపీ 59, వైఎస్సార్‌సీపీ 15 పీఠాలు దక్కించుకున్నాయి. కర్నూలులో 77 (మొత్తం 148) ఫలితాలు రాగా టీడీపీ 45, జనసేన, బీజేపీ చెరో 1, వైఎస్సార్‌సీపీ 23 చోట్ల గెలిచాయి. నంద్యాలలో ప్రకటించిన 60 (మొత్తం 136) స్థానాల్లో టీడీపీ 45, జనసేన 3, వైఎస్సార్‌సీపీ 11 చోట్ల నెగ్గాయి. అనంతపురంలో వెలువడిన 62 (మొత్తం 218) ఫలితాల్లో టీడీపీ 38, వైఎస్సార్‌సీపీ 20.. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రకటించిన 46 (మొత్తం 114) స్థానాల్లో టీడీపీ 27, బీజేపీ 1, వైఎస్సార్‌సీపీ 15 చోట్ల విజయం సాధించాయి.

కోస్తాంధ్రలో స్పష్టమైన ఆధిక్యం

కోస్తాంధ్ర పల్లెల్లోనూ కూటమి మద్దతుదారుల జోరు కొనసాగింది. పల్నాడులో ఏకగ్రీవాలతో కలిపి 173 స్థానాలకు గాను 131కి పైగా ఫలితాలు వెల్లడికాగా టీడీపీ 106, జనసేన 3, వైఎస్సార్‌సీపీ 19కి పైగా చోట్ల గెలుపొందాయి. ప్రకాశంలో ప్రకటించిన 108 (మొత్తం 139) ఫలితాల్లో టీడీపీ 93కి పైగా, వైఎస్సార్‌సీపీ 13.. మార్కాపురంలో వెల్లడైన 100 (మొత్తం 135) స్థానాల్లో టీడీపీ 81కి పైగా, వైఎస్సార్‌సీపీ 14 పీఠాలను కైవసం చేసుకున్నాయి. బాపట్లలో ప్రకటించిన 63 (మొత్తం 95) ఫలితాల్లో టీడీపీ 53, జనసేన 1, వైఎస్సార్‌సీపీ 6.. నెల్లూరులో వెలువడిన 61 (మొత్తం 134) స్థానాల్లో టీడీపీ 45, జనసేన 1, వైఎస్సార్‌సీపీ 13 చోట్ల గెలిచాయి. కృష్ణా జిల్లాలో ఏకగ్రీవాలతో కలిపి 136 స్థానాలకు 98 ఫలితాలు రాగా టీడీపీ 43కి పైగా, జనసేన 2, బీజేపీ 1, వైఎస్సార్‌సీపీ 20కి పైగా స్థానాలు దక్కించుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఏకగ్రీవాలతో కలిపి 73 స్థానాలకు 33 ఫలితాలు వెల్లడికాగా టీడీపీ 19, వైఎస్సార్‌సీపీ 9 చోట్ల నెగ్గాయి. మైలవరం, నిడమానూరు మేజర్ పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు భారీ మెజార్టీతో గెలుపొందారు.

ఉత్తరాంధ్ర పల్లెల్లో జయకేతనం

ఉత్తరాంధ్రలో ఏకగ్రీవాలతో కలిపి కూటమి మద్దతుదారులు మెజార్టీ పంచాయతీలను సొంతం చేసుకున్నారు. విజయనగరంలో (మొత్తం 221) టీడీపీ 88కి పైగా, జనసేన 2కి పైగా, వైఎస్సార్‌సీపీ 36కి పైగా స్థానాల్లో గెలిచాయి. పార్వతీపురం మన్యంలో (226) టీడీపీ 82కి పైగా, జనసేన 5కి పైగా, వైఎస్సార్‌సీపీ 42కి పైగా చోట్ల విజయం సాధించాయి. శ్రీకాకుళంలో (194) టీడీపీ 65కి పైగా, జనసేన 1, వైఎస్సార్‌సీపీ 25కి పైగా పీఠాలను దక్కించుకున్నాయి. అనకాపల్లిలో (215) టీడీపీ 45కి పైగా, జనసేన 10కి పైగా, బీజేపీ 4కి పైగా, వైఎస్సార్‌సీపీ 13కి పైగా.. అల్లూరి జిల్లాలో (66) టీడీపీ 12కి పైగా, వైఎస్సార్‌సీపీ 9కి పైగా స్థానాల్లో విజేతలుగా నిలిచాయి.

గోదావరి జిల్లాల్లో కూటమిదే పైచేయి

గోదావరి జిల్లాల్లో పలుచోట్ల గట్టి పోటీ ఎదురైనా ఏకగ్రీవాలతో కలిపి కూటమి మద్దతుదారులే ముందంజలో నిలిచారు. డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో (177) టీడీపీ 49కి పైగా, జనసేన 24కి పైగా, వైఎస్సార్‌సీపీ 59కి పైగా స్థానాల్లో గెలుపొందాయి. ఏలూరులో (177) టీడీపీ 27కి పైగా, జనసేన 3కి పైగా, వైఎస్సార్‌సీపీ 23కి పైగా.. కాకినాడలో (93) టీడీపీ 21కి పైగా, జనసేన 12కి పైగా, వైఎస్సార్‌సీపీ 11కి పైగా పీఠాలను కైవసం చేసుకున్నాయి. పశ్చిమగోదావరిలో (90) టీడీపీ 14కి పైగా, జనసేన 9కి పైగా, వైఎస్సార్‌సీపీ 10కి పైగా చోట్ల నెగ్గాయి. పోలవరంలో (91) టీడీపీ 8కి పైగా, వైఎస్సార్‌సీపీ 3కి పైగా.. తూర్పుగోదావరిలో (51) టీడీపీ 6కి పైగా, జనసేన 2కి పైగా, వైఎస్సార్‌సీపీ 2కి పైగా పంచాయతీల్లో విజయం సాధించాయి.

ప్రశాంతంగా ముగిసిన మినీ పురపోరు

- 4 కార్పొరేషన్లు, 19 పురపాలికల్లో పోలింగ్.. 30న కౌంటింగ్
- మంగళగిరిలో దొంగ ఓట్ల కలకలం.. రాజమహేంద్రవరంలో ఉద్రిక్తత
- విలీనంపై నిరసనగా అల్లూరులో నాలుగు వార్డుల బహిష్కరణ

అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్): రాష్ట్రంలో మలివిడత మినీ పురపోరు గురువారం ప్రశాంతంగా ముగిసింది. మంగళగిరిఉతాడేపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, శ్రీకాకుళం నగరపాలక సంస్థలతో పాటు 19 పురపాలికలు, నగర పంచాయతీల్లో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. మంగళగిరిఉతాడేపల్లి కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు సైతం ఊతకర్రలు, వీల్‌చైర్లలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 30న జరిగే ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. మంగళగిరి 62వ డివిజన్‌లో దొంగ ఓట్లు వేసేందుకు యత్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టీడీపీ ఏజెంట్లు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అప్పటికే కొన్ని దొంగ ఓట్లు పడినట్లు గుర్తించారు. 1వ డివిజన్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లబోయిన వైఎస్సార్‌సీపీ నేత టి. వేమారెడ్డిని పోలీసులు నిలువరించారు. రాజమహేంద్రవరం మల్లయ్యపేట 62వ వార్డు బూత్ వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు పెద్ద సంఖ్యలో ఉండటంపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అభ్యంతరం తెలపడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. 'దమ్ముంటే ఎవరు వస్తారో రండి.. బస్తీమే సవాల్' అంటూ వీర్రాజు తొడగొట్టి సవాల్ విసరడంతో ఉద్రిక్తత నెలకొంది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస 26వ వార్డు బూత్‌లోకి వెళ్లేందుకు యత్నించిన వైఎస్సార్‌సీపీ ఇంఛార్జి చింతాడ రవికుమార్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

నాలుగు వార్డుల్లో బహిష్కరణ..

నెల్లూరు జిల్లా అల్లూరు నగర పంచాయతీలో నార్త్ మోపూరు గ్రామాన్ని విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ 13, 14, 15, 16 వార్డుల ప్రజలు పోలింగ్‌ను పూర్తిగా బహిష్కరించారు. ఉపాధి పనులు పోతాయని, పన్నుల భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇక్కడ ఏ పార్టీ నామినేషన్లు వేయకపోగా, ఛైర్మన్ ఎన్నికకు బూత్‌లు పెట్టినా ఒక్క ఓటూ పడలేదు. మరోవైపు పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో పుష్కరకాలం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటర్లు భారీగా పాల్గొన్నారు. బాపట్లలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు ఓటేయగా, శ్రీకాళహస్తి పరిధిలోని ఊరందూరులో అయ్యప్ప భక్తులు ఓటు వేసి ఇరుముడితో శబరిమలకు బయలుదేరారు. కావలి, గూడూరు, పాలకొల్లు, భీమవరం పురపాలికల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది.


స్థానిక పోరులో యథేచ్ఛగా రిగ్గింగ్!

మంగళగిరి, రాయచోటి, గురజాలలో అక్రమాలు

రాప్తాడులో 200 బ్యాలెట్ పత్రాల అపహరణ

ఎస్ఈసీ స్పందించకపోతే న్యాయపోరాటమన్న వైఎస్సార్‌సీపీ

విజయవాడ, నవంబర్ 26 (సమయం న్యూస్) : రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ, రెండో దశ మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులు, అధికారుల సహకారంతో కూటమి నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీని కలిసి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, పార్టీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమారు చంద్రశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని 39, 40 బూత్‌లతో పాటు రాయచోటి, శ్రీకాళహస్తి, గురజాల, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో బహిరంగంగా రిగ్గింగ్, దాడులు జరిగాయని వారు ఆరోపించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో 200 బ్యాలెట్ పత్రాలను ఎత్తుకెళ్లినా, ఎవరు తీసుకెళ్లారో తెలియదని ఆర్వో చెప్పడం, రీపోలింగ్‌కు ఎస్ఈసీ ఆదేశించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ఏజెంట్లుగా ఉన్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, దొంతిరెడ్డి వేమారెడ్డిలను గృహనిర్బంధం చేసి తమ అభ్యర్థులను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఆళ్లగడ్డలో ఓటర్లపైకి కార్లు పోనిచ్చి దాడులకు పాల్పడ్డారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచిన చోట కూడా డిక్లరేషన్ ఫారాలను టీడీపీ వారికి ఇచ్చేస్తున్నారని విమర్శించారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు అక్రమాలపై ఇప్పటివరకు 46 వినతిపత్రాలు అందజేసినా ఎస్ఈసీ వాటిని కిందిస్థాయి అధికారులకు పంపి చేతులు దులుపుకుంటోందని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిగ్గింగ్‌ను అడ్డుకోవాల్సిన అధికారులు, పోలీసులు చోద్యం చూస్తూ తమ పార్టీ వారిపైనే ఎదురు కేసులు పెడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు మందలించినా అధికారుల తీరు మారడం లేదని, ఎస్ఈసీ ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.





ఏపీ సచివాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ఉద్యోగులతో తెలుగులో రాజ్యాంగ పీఠిక పఠనం

ప్రజాసేవలో పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యం

పాల్గొన్న ఉన్నతాధికారులు రావత్, సురేశ్ కుమార్, విశ్వనాథన్

అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్): ఏపీ సచివాలయం మొదటి భవనంలోని ముఖ్యమంత్రి కార్యాలయ ఆవరణలో గురువారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్.. సచివాలయ అధికారులు, ఉద్యోగులతో కలిసి తెలుగులో రాజ్యాంగ పీఠికను పఠించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా, 1950 జనవరి 26 నుంచి అది అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఏటా నవంబర్ 26న దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ మౌలిక ఆదర్శాల ప్రాధాన్యతను అధికారులు వివరించారు. రాజ్యాంగ విలువలను సిద్ధాంతాలకే పరిమితం చేయకుండా పరిపాలనా నిర్ణయాలు, ప్రజాసేవలో ఆచరణలో పెట్టాలని ఆకాంక్షించారు. విధుల నిర్వహణలో చట్టబద్ధత, నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ పౌరుల హక్కులను పరిరక్షించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ విభాగం సంయుక్త కార్యదర్శి రామసుబ్బయ్యతో పాటు సాధారణ పరిపాలన శాఖ, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎస్ఈసీ పునేఠా

15,100 కెమెరాలతో నిరంతర వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ

కానూరు, ఎనికేపాడు పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు

ఎక్కడా ఫిర్యాదుల్లేవు.. ప్రశాంతంగా పోలింగ్



విజయవాడ, నవంబర్ 26 (సమయం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరిగిన పట్టణ స్థానిక సంస్థలు, తొలిదశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిశితంగా పర్యవేక్షించారు. తొలుత విజయవాడలోని ఎస్ఈసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వివిధ జిల్లాల ప్రత్యక్ష ప్రసారాలను మీడియాకు చూపించారు. ఎన్నికల్లో పారదర్శకత కోసం పట్టణ ప్రాంతాల్లో 5,600, పంచాయతీల్లో 9,500.. మొత్తం 15,100కు పైగా కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. న్యాయపరమైన అభ్యంతరాలు తలెత్తితే ఆధారాలుగా ఉండేలా ఫుటేజీని భద్రపరుస్తామని స్పష్టం చేశారు. అనంతరం పునేఠా క్షేత్రస్థాయిలో పర్యటించి కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీ కానూరు రవీంద్ర భారతి పాఠశాలలోని 8 పోలింగ్ కేంద్రాలను, ఎన్టీఆర్ జిల్లా ఎనికేపాడు విజ్ఞాన విహార్ పాఠశాల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్లు, ఏజెంట్లు, సిబ్బందితో మాట్లాడి సౌకర్యాలు, భద్రత, కోడ్ అమలు తీరును పరిశీలించారు. ఎక్కడా ఫిర్యాదులు లేవని, పోలింగ్ ప్రశాంతంగా సాగుతోందని తెలిపారు. ఓటర్లు భయం, ఒత్తిడి లేకుండా ఓటేసేలా చూడాలని, అవసరమైతే అదనపు బలగాలను పంపాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎన్టీఆర్ కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆర్డీఓలు శ్రీనివాస్, కరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్ నజీర్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ వద్ద ఎమ్మెల్సీ తొడగొట్టి సవాల్

రాజమహేంద్రవరం 62వ వార్డులో ఉద్రిక్తత

వైఎస్సార్‌సీపీ నేతలపై సోము వీర్రాజు ఆగ్రహం

బాధ్యతాయుత పదవిలో ఇలాగేనా అంటూ విమర్శలు



రాజమహేంద్రవరం, నవంబర్ 26 (సమయం న్యూస్): రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంయమనం కోల్పోయి ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. రూరల్ మండలం కాతేరు పరిధిలోని 62వ వార్డు మల్లయ్యపేట పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. వైఎస్సార్‌సీపీ నాయకులపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో 'దమ్ముంటే రావాలి' అంటూ తొడగొట్టి సవాల్ విసరడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బాధ్యతాయుతమైన ఎమ్మెల్సీ పదవిలో ఉండి శాంతిభద్రతలను కాపాడాల్సింది పోయి, అధికార దర్పంతో ఇలా ప్రవర్తించడం సరికాదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేషనల్ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా బాలకృష్ణ

2025 పురస్కారాల ఎంపికకు ఏపీ ప్రభుత్వ కమిటీ

సభ్యులుగా అల్లు అరవింద్, గోపాల్‌రెడ్డి, ప్రభ

కన్వీనర్‌గా ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ ఎండీ నియామకం

అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్) : 2025 సంవత్సరానికి సంబంధించిన నేషనల్ ఫిల్మ్ అవార్డుల ఎంపిక కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జ్యూరీ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నియమించింది. జ్యూరీ సభ్యులుగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, ఎస్. గోపాల్ రెడ్డి, ప్రభలకు చోటు కల్పించింది. కమిటీ కన్వీనర్‌గా ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ వ్యవహరించనున్నారు. 2025 నేషనల్ ఫిల్మ్ అవార్డుల ఎంపిక బాధ్యతలను ఈ కమిటీ నిర్వహించనుంది.

రాయలచెరువు వద్ద ఘోర ప్రమాదం.. నలుగురి మృతి

అనంతపురం, నవంబర్ 26 (సమయం న్యూస్) : జిల్లాలోని యాడికి మండలం రాయలచెరువు సమీపంలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, ప్రయాణికులతో వస్తున్న తుపాన్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. తాడిపత్రి మండలం కావేరి సముద్రం గ్రామానికి చెందిన 11 మంది హైదరాబాద్‌లో పెళ్లి వేడుకకు హాజరై తుపాన్ వాహనంలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఈ విషాదం జరిగింది. రాయలచెరువు సమీపానికి చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన లారీ వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి తుపాన్ వాహనం పూర్తిగా ధ్వంసమైంది. మృతుల్లో యాడికికి చెందిన సిద్దు, లక్ష్మీప్రసాద్ ఉన్నట్లు పోలీసులు గుర్తించగా, మిగిలిన ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి పంపిన పోలీసులు కేసు నమోదు చేసి.. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లి సంతోషంతో వెళ్లిన వారు విషాదంతో తిరిగి రావడంతో కావేరి సముద్రం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాద ఘటనపై మంత్రులు అనిత, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, సవిత ఆరా తీశారు. నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

సంపాదకీయం



ట్రంప్ 25 శాతం టారిఫ్స్ వార్నింగ్

భారత 'మేకిన్ ఇండియా'కు సవాళ్లు..!

భారత్‌పై 25 శాతం సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ సర్కారు చేసిన హెచ్చరికలు భారత మేకిన్ ఇండియా ప్రక్రియకు సవాల్‌గా మారాయి. ప్రపంచ తయారీ కేంద్రంగా మారాలన్న భారతదేశ ఆశయానికి ఈ టారిఫ్ భయాలు అడ్డంకి మారాయి. ప్రపంచ సరఫరా గొలుసులను చైనాకు దూరం చేయడం గురించి పదేపదే మాట్లాడుతున్న అమెరికా.. ఇప్పుడు భారత్ తన తయారీ రంగాన్ని నిర్మించుకోవడానికి అనుసరిస్తున్న కొన్ని విధానాలను కూడా ప్రశ్నిస్తున్నది. అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ, అమెరికా తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు భారతీయ పారిశ్రామిక రంగానికి కొత్త పరీక్షగా నిలుస్తున్నాయి.

'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్', 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' వంటి కార్యక్రమాలపై డొనాల్డ్ ట్రంప్ సర్కారు కన్నేసింది. ప్రభుత్వ మద్దతుతో జరిగే తయారీరంగ విస్తరణ దేశీయ మార్కెట్‌కు అవసరమైన దానికంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యాన్ని సృష్టిస్తుందని, ఇది భారతీయ కంపెనీలు తమ మిగులు ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకునేలా చేసి అమెరికన్ తయారీదారులపై ఒత్తిడిని పెంచుతుందని అగ్రరాజ్యం వాదిస్తున్నది. స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, ఆర్థిక మద్దతు విధానాల వల్ల ప్రపంచ మార్కెట్‌లో అసమాన పోటీ తలెత్తుతోందన్న అభిప్రాయాన్ని అమెరికా యంత్రాంగం బలంగా వినిపిస్తోంది. తయారీ సామర్థ్యం, ఉత్పత్తికి సంబంధించి భారతదేశ విధానాలు అసమంజసంగా ఉన్నాయని, అమెరికా వాణిజ్యాన్ని పరిమితం చేస్తున్నాయని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) నిర్ధారించింది. కొన్ని ఉత్పత్తులకు మినహాయింపులతో ఇప్పటికే ఉన్న సెక్షన్ 301 సుంకాలకు అదనంగా భారతీయ వస్తువులపై 25 శాతం వరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టీఆర్ ప్రతిపాదించింది. అయితే ఒక వెసులుబాటు ఉండే అవకాశం ఉంది. విచారణలో లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించేలా భారత్, వాషింగ్టన్ మధ్య ఏదైనా వాణిజ్య ఒప్పందం కుదిరితే, ప్రతిపాదిత రేటును 17 శాతానికి సర్దుబాటు చేయవచ్చు. ఇరుదేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చలు, సయోధ్య ప్రయత్నాల ఫలితంగా సుంకాల భారాన్ని కొంతమేర తగ్గించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ప్రాథమికంగా ప్రకటించిన 25 శాతం ప్రతిపాదన ఎగుమతిదారుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. భారతీయ తయారీ రంగంలో కీలక రంగాలైన ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటోమొబైల్ విడిభాగాలు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలపై అమెరికా సుంకాల ప్రభావం పడే అవకాశం ఉందని వాణిజ్య విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ హెచ్చుతగ్గులు, రవాణా ఖర్చుల ఒత్తిడుల మధ్య పనిచేస్తున్న భారతీయ సంస్థలకు అదనపు పన్నుల భారం తోడైతే అమెరికా మార్కెట్‌లో ధరల పోటీని తట్టుకోవడం కష్టతరమవుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, చైనా నుంచి సరఫరా గొలుసులను వైవిధ్యపరచాలనే ఆలోచనలో ఉన్న విదేశీ సంస్థలు భారత్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో, టారిఫ్ అనిశ్చితి పెట్టుబడి నిర్ణయాల వేగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. పన్ను వివాదాల నిర్వహణ నిపుణుడు మనోజ్ మిశ్రా.. యూఎస్‌టీఆర్ ప్రతిపాదన భారత్–అమెరికా వాణిజ్య సంబంధాల చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతుందని తెలిపారు. 'ఇప్పటికే ఉన్న సెక్షన్ 301 సుంకాలను మినహాయించి, కొన్ని మినహాయింపులకు లోబడి, భారతీయ వస్తువులపై 25 శాతం వరకు సుంకాలను విధించాలన్న అమెరికా ప్రతిపాదన భారత్–అమెరికా వాణిజ్య సంబంధాల చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతుంది. 'మేక్ ఇన్ ఇండియా', 'పిఎల్‌ఐ'తో సహా భారతదేశపు కీలక పారిశ్రామిక కార్యక్రమాలు యూఎస్‌టీఆర్ పరిశీలనలోకి వస్తున్న తరుణంలో ఈ ప్రతిపాదిత చర్యలు భారతదేశపు ఎగుమతి పోటీతత్వాన్ని బలహీనపరిచి, లాభాల మార్జిన్‌లపై ఒత్తిడిని పెంచి, తయారీ రంగ పెట్టుబడులను నిరుత్సాహపుస్తాయి' అని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత వాణిజ్య, పరిశ్రమల వర్గాలు, విధాన నిర్ణేతలు అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం లేవనెత్తిన అంశాలపై లోతుగా విశ్లేషించి, చర్చల ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఏర్పడింది. స్వదేశీ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తూనే, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు, భాగస్వామ్య దేశాల ఆందోళనలకు సమతుల్యంగా స్పందించడం ద్వారా దీర్ఘకాలికంగా 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలను సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాణిజ్య ఒప్పంద చర్చల్లో స్పష్టత వచ్చే వరకు ఎగుమతి సంస్థలు, తయారీదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ మార్కెట్లు, వ్యూహాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది.



పార్లమెంట్‌లో కీలక ఘట్టానికి తెర!

- ఈ నెల 30న లోక్‌సభ.. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ
- లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచే ప్రతిపాదన?
- ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలో దక్షిణాది రాష్ట్రాలు
- పార్లమెంట్ సమావేశాలపై కాంగ్రెస్ వ్యూహరచన



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): పార్లమెంట్ ఉభయ సభలను తిరిగి సమావేశపరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 30న లోక్‌సభను, డిసెంబర్ 2న రాజ్యసభను సమావేశపరచాలని కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు కొనసాగించే అవకాశముందని తెలిపారు. ఇవి కొత్త సమావేశాలు కాదని, గత వర్షాకాల సమావేశాల కొనసాగింపుగానే పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు. కీలకమైన ప్రభుత్వ కార్యకలాపాలను పూర్తి చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అయితే సమావేశాల పూర్తి కార్యాచరణను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో గత ఆగస్టు 13న పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయితే వర్షాకాల సమావేశాలను అధికారికంగా ముగించకపోవడంపై రాజకీయ వివాదం నెలకొంది. నియోజకవర్గాల పునర్విభజన కోసమే శీతాకాల సమావేశాలను కేంద్రం ఆలస్యం చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తోందని అధికార ఎన్డీఏ ఈ ఆరోపణలను ఖండించింది. తాజా సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణను కేంద్రం ప్రవేశపెట్టే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే లోక్‌సభతోపాటు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే లోక్‌సభలో తమ ప్రాతినిధ్య వాటా తగ్గిపోయే ప్రమాదముందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను 50 శాతం చొప్పున పెంచే ప్రత్యామ్నాయాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ప్రస్తుత సీట్ల పంపిణీ నిష్పత్తిని యథాతథంగా కొనసాగించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనలపై కేంద్రం ఇంకా తుది నిర్ణయం ప్రకటించలేదు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనకు సిద్ధమైంది. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశం కానుంది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన అంశాలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన విషయాలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

మొబైల్ ఫోన్లు, మైకులు పట్టుకున్న వారు
జర్నలిస్టులు కాదు..

జర్నలిస్టులు, రీల్ క్రియేటర్ల మధ్య తేడాపై సుప్రీం విచారణ..

వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులకు భద్రతపై దృష్టి

జర్నలిస్టులపై దాడుల ఆరోపణల విచారణకు ఉన్నతస్థాయి కమిటీ



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): మొబైల్ ఫోన్, మైక్ పట్టుకున్న ప్రతి ఒక్కరినీ జర్నలిస్టుగా పరిగణించాలా? వృత్తిపరమైన జర్నలిస్టులకు, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు రూపొందించే వారికి మధ్య తేడాలను ఎలా గుర్తించాలి? అనే కీలక అంశాలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. జర్నలిస్టుల చట్టపరమైన గుర్తింపు, వార్తా సేకరణ సమయంలో వారికి కల్పించాల్సిన రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీలో అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగిన నిరసనల సందర్భంగా ఏడుగురు జర్నలిస్టులను నిర్బంధించడంతోపాటు వారిపై దాడి చేసి, వార్తా సేకరణకు ఆటంకం కలిగించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనపై ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్, కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, స్వతంత్ర జర్నలిస్టు పరంజోయ్ గుహా ఠాకుర్తా తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాడుల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటు చేసింది. నిరసనలు, భారీ ప్రదర్శనలు, జనసమూహాల మధ్య వార్తలు సేకరించే జర్నలిస్టులకు పోలీసులు, ఇతర అధికారుల నుంచి ఎలాంటి రక్షణ కల్పించాలనే అంశాన్ని పరిశీలించనున్నట్లు జస్టిస్ జయమాల్య బాగ్చి పేర్కొన్నారు. వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులను అనవసరంగా నిర్బంధించడం, దాడులకు పాల్పడటం, విధులకు ఆటంకం కలిగించడం వంటి ఘటనల నివారణపై న్యాయస్థానం దృష్టి సారించింది. అయితే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించడం అంటే చట్టం నుంచి మినహాయింపు ఇవ్వడం కాదని, పోలీసుల చట్టబద్ధమైన ఆదేశాలను వారు కూడా పాటించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులు, నమోదిత మీడియా సంస్థల్లో పనిచేసే పాత్రికేయులు, స్వతంత్ర జర్నలిస్టులతోపాటు సామాజిక మాధ్యమాల్లో సమాచారాన్ని అందించే వారికి ఒకే తరహా భద్రతా నిబంధనలు వర్తింపజేయాలా? లేక వృత్తిపరమైన జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించాలా? అనే అంశం విచారణలో కీలకంగా మారింది. మరోవైపు సామాజిక మాధ్యమ ప్రభావకర్తలు, రీల్ క్రియేటర్లను వృత్తిపరమైన జర్నలిస్టుల నుంచి వేరుగా గుర్తించాలని ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టులో వాదించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్లు, మైకులు ఉంటుండటంతో వార్తలు సేకరించే జర్నలిస్టులకు, నిరసనల్లో పాల్గొనే వ్యక్తులకు మధ్య తేడాను గుర్తించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. వృత్తిపరమైన జర్నలిస్టులకు మాత్రమే ప్రత్యేక భద్రతా నిబంధనలు వర్తింపజేయాలని కోరారు. అరెస్టయిన తర్వాత తాము జర్నలిస్టులమని చెప్పుకునే వారికి ప్రత్యేక రక్షణ కల్పించకూడదని వాదించారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు, హక్కులు, భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు ఎలాంటి మార్గదర్శకాలు రూపొందిస్తుందనే ఆసక్తి మీడియా వర్గాల్లో నెలకొంది.

వ్యాపారులకు కేంద్రం ఊరట

ఇక క్షణాల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దు..



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): వ్యాపారులకు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్త అందించింది. ఇకపై జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 2026, డిసెంబర్ 1వ తేదీ నుంచి ఈ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేసుకునేలా కేంద్ర ఆర్థిక శాఖ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ఇందుకోసం 2017 నాటి జీఎస్టీ నియమాలలో కీలక మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఎవరైనా తమ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవాలనుకుంటే, ముందుగా తమ చివరి పన్ను కాలానికి సంబంధించిన రిటర్నులను దాఖలు చేయాలి. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇతర బకాయిలన్నీ పూర్తిగా చెల్లించాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రద్దు కోసం దరఖాస్తు చేసుకుంటే, అధికారుల ప్రమేయం లేకుండానే నేరుగా పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది. దరఖాస్తులో పేర్కొన్న తేదీ నుంచే ఈ రద్దు అమల్లోకి వస్తుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని పన్ను చెల్లింపుదారులకు 'ఫామ్ జీఎస్టీ ఆర్ఈజీ-38' ద్వారా ఆన్‌లైన్‌లోనే పంపిస్తారు. ఒకవేళ దరఖాస్తుదారుడు తమ రిటర్నులను సరిగ్గా దాఖలు చేయకపోయినా, లేదా ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు, వడ్డీలు, జరిమానాలు ఏవైనా బాకీ ఉన్నా ఆ దరఖాస్తు ఆటోమేటిక్‌గా రద్దు కాదు. అలాంటి దరఖాస్తులు సంబంధిత అధికారి పరిశీలనకు వెళ్తాయి. అన్ని బకాయిలు క్లియర్ చేస్తేనే సులభంగా ఆన్‌లైన్‌లో పని పూర్తవుతుంది. కొత్తగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకునే వారి కోసం కూడా ప్రభుత్వం పోర్టల్‌లో మరిన్ని మార్పులు చేసింది. దరఖాస్తు ఫామ్ నింపేటప్పుడు ఎలాంటి తప్పులు జరగకుండా ఎప్పటికప్పుడు సూచనలు కనిపించేలా వెసులుబాటు కల్పించింది. పత్రాలను సులభంగా అప్‌లోడ్ చేసేందుకు డ్రాప్-డౌన్ బాక్సులను కూడా చేర్చింది. రిజిస్ట్రేషన్ చేసుకునే పూర్తి విధానాన్ని తెలుసుకోవడానికి జీఎస్టీ వెబ్‌సైట్‌లోని 'హెల్ప్' విభాగంలో ఉన్న 'జీఎస్టీ నాలెడ్జ్ పోర్టల్' ద్వారా స్టెప్-బై-స్టెప్ గైడ్‌ను కూడా అందుబాటులో ఉంచింది.

మదుపర్లకు సెబీ ఊరట

కేవైసీ నిబంధనలు సరళతరం!

డిసెంబర్ 24 నుంచి కొత్త నిబంధనలు అమలు



ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): స్టాక్ మార్కెట్ మదుపర్లకు భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) కీలక ఊరటనిచ్చింది. ఖాతాల ప్రారంభ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ కేవైసీ నిబంధనల్లో మార్పులు ప్రకటించింది. వేర్వేరు బ్రోకరేజ్ సంస్థల వద్ద ఖాతాలు తెరిచే సమయంలో ఒకే రకమైన పత్రాలను పదేపదే సమర్పించాల్సిన అవసరం లేకుండా చర్యలు చేపట్టింది. మధ్యవర్తిత్వ సంస్థల మధ్య సమాచార మార్పిడిని మెరుగుపరచడంతోపాటు మదుపర్ల వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రాధాన్యం కల్పించింది. కొత్త నిబంధనల ప్రకారం ఖాతా ప్రారంభ దరఖాస్తులోని రెండో భాగంలో ఉండే సాధారణ అదనపు సమాచారాన్ని కేవైసీ నమోదు సంస్థ (కేఆర్ఏ) స్థాయిలోనే కేంద్రీకరించనున్నారు. సీకేవైసీ గుర్తింపు సంఖ్య, డిజిపిన్, అధికారిక పత్రాల చెల్లుబాటు గడువు వివరాలను కేఆర్ఏ వ్యవస్థలో నమోదు చేయాల్సి ఉంటుంది. మదుపర్ల మొబైల్ నంబర్ ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానమై, కేఆర్ఏ వ్యవస్థలో ధ్రువీకరణ పూర్తయితే మధ్యవర్తిత్వ సంస్థలు మళ్లీ తనిఖీ చేయాల్సిన అవసరం ఉండదు. పేరు మార్పు విషయంలోనూ సెబీ వెసులుబాటు కల్పించింది. పాన్, ఆధార్ కార్డుల్లో పేరు మార్పు పూర్తయితే అదనపు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. లేకపోతే వివాహ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు వంటి పత్రాలను అందించాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం-2025 ప్రకారం భారతీయ నివాసితులుగా అర్హత పొందిన ఓసీఐ కార్డుదారులు, విదేశీయులు భారతీయ చిరునామా రుజువును సమర్పిస్తే విదేశీ చిరునామాకు సంబంధించిన పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మదుపర్ల ఖాతాలు మూసివేసినప్పుడు లేదా మ్యూచువల్ ఫండ్ ఫోలియోలో వరుసగా ఆరు నెలలపాటు ఎలాంటి లావాదేవీలు లేకుండా నిల్వ సున్నాగా ఉన్నప్పుడు ఐదు పనిదినాల్లోగా కేఆర్ఏకు సమాచారం అందించాల్సి ఉంటుంది. తద్వారా అవసరం లేని సంస్థలతో మదుపర్ల వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడాన్ని నివారించనున్నారు. కేవైసీ వివరాలను ధ్రువీకరించినవి, ధ్రువీకరించనివిగా కేఆర్ఏలు వర్గీకరించనున్నాయి. ఈ కొత్త నిబంధనలు డిసెంబర్ 24 నుంచి అమల్లోకి రానున్నాయి.



కర్ణాటక బడుల్లో రాజ్యాంగ పాఠాలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచే సిలబస్‌లో చేర్పు

విద్యార్థుల్లో అవగాహనకు యూత్ పార్లమెంట్ల ఏర్పాటు

డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన

మైసూరు, నవంబర్ 26 (సమయం న్యూస్) : వచ్చే విద్యా సంవత్సరం నుంచి కర్ణాటకలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నింటిలో రాజ్యాంగంపై పాఠాలను సిలబస్‌లో చేర్చనున్నట్లు ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. గురువారం మైసూరులో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరుల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వానికి రక్షణ కవచం లాంటిదని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచేందుకు పాఠశాలల్లో యూత్ పార్లమెంట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాజ్యాంగం నిర్దేశించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మౌలిక విలువలను ప్రతి ఒక్కరూ తూ.చ. తప్పకుండా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.

జలచర ఆరోగ్య సేవలపై 'డబ్ల్యూఓఏహెచ్' మూల్యాంకనం

భారత్‌లో 'ఏఏహెచ్ఎస్' బలోపేతానికి ప్రత్యేక మిషన్ ప్రారంభం

నవంబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకు పలు రాష్ట్రాల్లో పర్యటన

ఆక్వా ఫారాలు, ప్రయోగశాలలు, నాణ్యత కేంద్రాల పరిశీలన

సముద్ర ఆహార వాణిజ్యానికి పెరగనున్న అంతర్జాతీయ విశ్వసనీయత



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్) : భారత్‌లో జలచర జంతువుల ఆరోగ్య సేవలను (ఏఏహెచ్ఎస్) మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రపంచ జంతు ఆరోగ్య సంస్థ (డబ్ల్యూఓఏహెచ్) పనితీరు మూల్యాంకన మిషన్ ప్రారంభమైంది. న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన ఓరియంటేషన్ సమావేశంతో ఈ కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మిషన్‌లో భాగంగా జలచర జంతువుల వ్యాధుల పర్యవేక్షణ, పరిశోధన, సామర్థ్య పెంపు, ఆహార భద్రత, ఎగుమతి నాణ్యత, నియంత్రణ ప్రమాణాలు తదితర అంశాలను నిపుణులు సమగ్రంగా పరిశీలించనున్నారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకు డబ్ల్యూఓఏహెచ్ నిపుణుల బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించనుంది. ఆయా రాష్ట్రాల్లోని ఆక్వాకల్చర్ ఫారాలు, పరిశోధనా సంస్థలు, వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు, నాణ్యత నియంత్రణ కేంద్రాలను స్వయంగా సందర్శించి పనితీరును అంచనా వేయనుంది. ఈ మూల్యాంకన ప్రక్రియ ద్వారా దేశంలో జలచర వ్యాధుల నివారణ, పర్యవేక్షణ, సంస్థాగత సామర్థ్యాలు మరింత మెరుగుపడటంతో పాటు అంతర్జాతీయ సముద్ర ఆహార వాణిజ్యంలో భారత్‌కు మరింత విశ్వసనీయత పెరుగుతుందని కేంద్ర మత్స్య శాఖ స్పష్టం చేసింది.

మెటాపై న్యాయ పోరాటానికి దిగిన కాంగ్రెస్

ఢిల్లీ హైకోర్టులో ఇండియన్ యూత్ కాంగ్రెస్ పిటిషన్

న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్) : సోషల్ మీడియా దిగ్గజ సంస్థ మెటాతో కాంగ్రెస్ పార్టీ వివాదం మరింత ముదిరింది. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీ పేరుతో లేదా ఆయన ఫొటోలతో పెట్టే పోస్టులను మెటా సంస్థ ఉద్దేశపూర్వకంగా బ్లాక్ చేస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే మెటా కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టిన కాంగ్రెస్.. తాజాగా న్యాయపోరాటానికి దిగింది. మెటాతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని సైతం సవాలు చేస్తూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాజకీయ భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకునేలా నిబంధనలు ఉన్నాయని పిటిషన్‌లో కాంగ్రెస్ ఆరోపించింది. తమ కార్యకర్తలు రాహుల్ గాంధీ పేరుతో, ఆయన ఫొటోలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వాటిని మెటా ఆటోమేటిక్ విధానంలో గుర్తించి బ్లాక్ చేస్తోందని పేర్కొంది. పుట్టినరోజు శుభాకాంక్షలు, నివాళులు, పెళ్లి ఆహ్వాన పత్రిక వంటి సాధారణ పోస్టులు కూడా తొలగింపునకు గురయ్యాయని అసహనం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2026లో సమాచార సాంకేతిక నిబంధనలను సవరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఆ నిబంధనలను రద్దు చేయాలని, తొలగించిన పోస్టులను పునరుద్ధరించాలని, కంటెంట్‌ను పరిమితం చేయడానికి ఉపయోగిస్తున్న ప్రమాణాలను వెల్లడించాలని కోర్టును కోరింది.

అంతరిక్షంలో తొలి పాకిస్థానీ.. జీషన్ అలీ చరిత్ర

- చైనా 'షెన్‌జౌ-24' మిషన్‌లో కక్ష్యలోకి ప్రవేశం
- తియాంగాంగ్ చేరిన తొలి విదేశీ వ్యోమగామిగా ఘనత
- వారం పాటు అంతరిక్షంలో కీలక శాస్త్రీయ ప్రయోగాలు
- చైనా-పాక్ సహకారంలో నూతన అధ్యాయానికి నాంది



ఇస్లామాబాద్/బీజింగ్, నవంబర్ 26 (సమయం న్యూస్): అంతరిక్ష రంగంలో పాకిస్థాన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆ దేశానికి చెందిన మహమ్మద్ జీషన్ అలీ.. చైనా చేపట్టిన 'షెన్‌జౌ24' మానవ సహిత అంతరిక్ష మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి ప్రవేశించారు. తద్వారా చైనా నిర్మించిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌లోకి అడుగుపెట్టిన తొలి విదేశీ వ్యోమగామిగా ఆయన అరుదైన గుర్తింపు పొందారు. కక్ష్యలోకి చేరిన మొట్టమొదటి పాకిస్థానీగానూ జీషన్ అలీ చరిత్ర పుటల్లో నిలిచారు.

ఎవరీ జీషన్ అలీ?

40 ఏళ్ల జీషన్ అలీ గతంలో పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్‌గా పనిచేశారు. సైనిక విమానయానంలో విశేష అనుభవం ఉన్న ఆయనను చైనాఉపాకిస్థాన్ సంయుక్త అంతరిక్ష కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఈ మిషన్‌లో ఆయన పేలోడ్ స్పెషలిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతరిక్ష నౌకలో తీసుకెళ్లే శాస్త్రీయ పరికరాలు, ప్రయోగ సామగ్రిని నిర్వహించే నిపుణుడినే పేలోడ్ స్పెషలిస్ట్ అంటారు. 2026 ఏప్రిల్‌లో చైనా మానవ సహిత అంతరిక్ష కార్యక్రమం కోసం ఎంపిక చేసిన తొలి విదేశీ వ్యోమగాములో జీషన్ అలీతో పాటు మరో పాకిస్థాన్ వైమానిక దళ పైలట్ ఖుర్రమ్ దావూద్ ఉన్నారు.

ఏడు నెలల కఠిన శిక్షణ

అంతరిక్ష ప్రయాణానికి ముందు జీషన్ అలీ సుమారు ఏడు నెలల పాటు చైనాలో అత్యంత కఠినమైన శిక్షణ పొందారు. అంతరిక్ష నౌక, స్పేస్ స్టేషన్ వ్యవస్థలు, శాస్త్రీయ ప్రయోగాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధానాలపై పట్టు సాధించారు. చైనా వ్యోమగాములతో సమన్వయం చేసుకునేందుకు చైనీస్ భాషను సైతం నేర్చుకున్నారు. అంతరిక్ష ప్రయాణంలో శరీరంపై పడే అధిక ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పరీక్షించే 'సెంట్రిఫ్యూజ్ పరీక్షలు' సహా అత్యవసర డ్రిల్స్, ప్రమాద పరిస్థితుల్లో రక్షణ, జీవనాధార శిక్షణ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

షెన్‌జౌ-24లో ముగ్గురు వ్యోమగాములు

షెన్‌జౌ24 అంతరిక్ష నౌకలో మొత్తం ముగ్గురు వ్యోమగాములు ప్రయాణించారు. చైనాకు చెందిన టాంగ్ హోంగ్‌బో, వు యితో పాటు పాకిస్థాన్‌కు చెందిన జీషన్ అలీ ఈ బృందంలో ఉన్నారు. వీరిలో మొత్తం అంతరిక్ష యాత్రకు నాయకత్వం వహించే 'మిషన్ కమాండర్'గా టాంగ్ హోంగ్‌బో, అంతరిక్ష నౌక, పరికరాల సాంకేతిక వ్యవస్థలను పర్యవేక్షించే 'ఫ్లైట్ ఇంజినీర్'గా వు యి, 'పేలోడ్ స్పెషలిస్ట్'గా జీషన్ అలీ వ్యవహరిస్తున్నారు.

శాస్త్రీయ ప్రయోగాల్లో కీలక పాత్ర

తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌లో జీషన్ అలీ సుమారు వారం రోజుల పాటు ఉండి శాస్త్రీయ పరిశోధనల్లో పాలుపంచుకుంటారు. ప్రయోగ పరికరాలను అమర్చడం, నమూనాలను పరిశీలించడం, వివిధ ప్రయోగాలను నిర్వహించడం ఆయన ప్రధాన బాధ్యతలు. ఈ మిషన్‌లో బయోటెక్నాలజీ, మెటీరియల్స్ సైన్స్ రంగాల్లో చైనాఉపాకిస్థాన్ సంయుక్త పరిశోధనలు చేపడుతున్నాయి. జీవులు, కణాలు లేదా జీవసంబంధ పదార్థాలను ఉపయోగించి ఉపయోగకరమైన సాంకేతికతలను అభివృద్ధి చేసే శాస్త్రాన్ని బయోటెక్నాలజీగా, కొత్త పదార్థాల లక్షణాలను అధ్యయనం చేసి వాటిని మెరుగైన సాంకేతిక, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించే శాస్త్రాన్ని మెటీరియల్స్ సైన్స్‌గా పిలుస్తారు. వీటితో పాటు అంతరిక్షంలో 'ఫోటోసింథటిక్ సయనోబ్యాక్టీరియా'పై కూడా ప్రయోగం చేపట్టనున్నారు. సూర్యకాంతిని ఉపయోగించి ఆహారం తయారు చేసుకునే ఈ సూక్ష్మజీవులపై జరిగే పరిశోధన భవిష్యత్తులో ఆహార ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ రంగాలకు ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది.

తియాంగాంగ్ అంటే ఏమిటి?

తియాంగాంగ్ అనేది చైనా సొంతంగా నిర్మించిన మానవ సహిత అంతరిక్ష కేంద్రం. భూమి లేదా మరో గ్రహం చుట్టూ ఒక వస్తువు నిర్దిష్ట మార్గంలో తిరిగే పథాన్ని కక్ష్య అంటారు. ఇలా భూమికి వెలుపల కక్ష్యలో తిరుగుతూ వ్యోమగాములు తియాంగాంగ్‌లో నిరంతరం శాస్త్రీయ పరిశోధనలు నిర్వహిస్తుంటారు.

చైనా-పాక్ సంబంధాల్లో కీలక ఘట్టం

జీషన్ అలీ అంతరిక్ష యాత్ర చైనాఉపాకిస్థాన్ శాస్త్రీయ, సాంకేతిక సహకారంలో కీలక పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. తియాంగాంగ్‌లోకి ఒక విదేశీ వ్యోమగామి ప్రవేశించడం చైనా మానవ సహిత అంతరిక్ష కార్యక్రమంలో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. దీని ద్వారా ఇరు దేశాల మధ్య అంతరిక్ష సహకారం భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సంయుక్త శాస్త్రీయ పరిశోధనలు, అంతరిక్ష ప్రయోగాలు, మానవ సహిత మిషన్లలో ఇరు దేశాలు కలిసి పనిచేసే అవకాశం ఉంది.

అంతరిక్షంలో పాక్ సంప్రదాయానికి గౌరవం

తియాంగాంగ్ చేరుకున్న జీషన్ అలీకి చైనా వ్యోమగాములు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఆయన కోసం ప్రత్యేక హలాల్ ఆహార మెనూను కూడా సిద్ధం చేసినట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ మెనూలో పాకిస్థాన్‌కు చెందిన పలు సంప్రదాయ వంటకాలు ఉన్నట్లు సమాచారం. అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టిన అనంతరం జీషన్ అలీ ప్రముఖ పాకిస్థానీ కవి అల్లామా మహమ్మద్ ఇక్బాల్ కవితను ప్రస్తావించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పాకిస్థాన్‌లో సంబరాలు.. చంద్రుడు, అంగారకుడి దిశగా అడుగులు

జీషన్ అలీ అంతరిక్ష ప్రయాణంపై పాకిస్థాన్ వ్యాప్తంగా ప్రజలు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆయనను అభినందిస్తూ.. ఈ ప్రయాణం దేశ యువతకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. చైనాఉపాకిస్థాన్ సంబంధాల్లో ఇది మరో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. జీషన్ అలీ యాత్రను కేవలం వ్యక్తిగత విజయంగానే కాకుండా భవిష్యత్ అంతరిక్ష సహకారానికి నాందిగా భావిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని సంయుక్త మిషన్లు చేపట్టి చంద్రుడు, అంగారక గ్రహ పరిశోధనల దిశగా ముందుకు సాగాలన్న లక్ష్యాలతో ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి. పాకిస్థాన్‌కు శాస్త్రీయంగా, సాంకేతికంగా అత్యంత ప్రతిష్ఠాత్మక ఘట్టంగా నిలిచిన ఈ ప్రయాణం.. అంతరిక్ష రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యానికి, ముఖ్యంగా చైనాఉపాక్ సహకారానికి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.





ఇంద్రకీలాద్రిపై కార్తీక విశేష పూజలు

- మల్లేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆధ్యాత్మిక క్రతువులు
- శాస్త్రోక్తంగా ఆకాశదీపం, సహస్ర లింగార్చన, ఊయల సేవ
- పాల్గొన్న ఆలయ ఛైర్మన్ గాంధీ, ఈవో శీనా నాయక్



ఇంద్రకీలాద్రి, నవంబర్ 26 (సమయం న్యూస్) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం విశేష పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ పూజా క్రతువులతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ విశేష పూజా కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత, రాఘవరాజు, సహాయ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె. గంగాధర్, పర్యవేక్షకులు హేమ దుర్గాంబ, సీనియర్ అసిస్టెంట్ పి. శిరీష పాల్గొన్నారు.



మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ ముందస్తు విడుదల రద్దు

జైలు అధికారులకు లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశం

2023 బిహార్ ప్రభుత్వ నిబంధనల మార్పు రాజ్యాంగ విరుద్ధం

ఐఏఎస్ కృష్ణయ్య భార్య ఉమాదేవి పిటిషన్‌పై సంచలన తీర్పు

ప్రభుత్వాల ఇష్టారాజ్య నిర్ణయాలకు మౌన ప్రేక్షకులం కాదన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్) : ఐఏఎస్ అధికారి జి. కృష్ణయ్య హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన బిహార్ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ సింగ్ ముందస్తు విడుదలను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. 2023లో బిహార్ ప్రభుత్వం ఆయన శిక్షను కుదించి ముందస్తుగా విడుదల చేసేందుకు జైలు నిబంధనల్లో చేసిన మార్పులు చట్టప్రకారం సమర్థనీయం కాదని, చెల్లవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇందుకు సంబంధించి బిహార్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ.. తక్షణమే జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను ఆదేశించింది. ఆయన విడుదలను సవాలు చేస్తూ దివంగత ఐఏఎస్ అధికారి భార్య ఉమాదేవి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ సంచలన తీర్పు వెలువరించింది. శిక్ష తగ్గింపునకు సంబంధించి 2002 నాటి నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగుల హత్య కేసుల్లో దోషులకు ముందస్తు విడుదలకు అవకాశం లేదు. అయితే ఆనంద్ మోహన్ విడుదలకు వీలుకలిగేలా ఈ నిబంధనను తొలగిస్తూ బిహార్ ప్రభుత్వం 2023లో మార్పులు చేసింది. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. అకస్మాత్తుగా, ప్రత్యేకంగా తీసుకున్న ఈ నిర్ణయం ఎంతమాత్రం సమర్థనీయం కాదని, ఈ మార్పునకు హేతుబద్ధమైన కారణం చూపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంది. ఫలితంగా 2023 నాటి నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా మారాయని, ఆర్టికల్ 21ను ఉల్లంఘించాయని స్పష్టం చేసింది.

ఆనంద్ మోహన్ శిక్ష తగ్గింపు అంశాన్ని మరోసారి పరిశీలించే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే ఆనంద్ మోహన్ లొంగిపోయిన నెల రోజుల తర్వాతే ఈ ప్రక్రియను చేపట్టాలని, ఆ సమయంలో తన వాదనలు వినిపించుకునేందుకు మాజీ ఎంపీకి అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. సత్యాన్వేషణే కోర్టు బాధ్యతని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. ప్రభుత్వాలు ఇష్టారీతిన తీసుకునే నిర్ణయాలకు అడ్డుకట్ట వేసేందుకు కోర్టులు న్యాయసమీక్ష జరుపుతాయని, తాము మౌన ప్రేక్షకులుగా ఉండబోమని తేల్చిచెప్పింది. కాగా, 1994లో గోపాల్‌గంజ్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్యకు గురయ్యారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు 2007లో ఆనంద్ మోహన్‌కు మరణ శిక్ష విధించగా, 2008లో పట్నా హైకోర్టు దానిని యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. హైకోర్టు తీర్పును 2012లో సుప్రీంకోర్టు సమర్థించింది.

ఆరని 26/11 గాయం.. ముంబై దాడికి 18 ఏళ్లు

2008 నాటి ఉగ్రదాడిలో 166 మంది అమాయకులు బలి

బాధితులు, అమర జవాన్లకు జైశంకర్ నివాళి

ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేస్తామని 'ఎక్స్'లో స్పష్టీకరణ



ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్) : దేశాన్ని కుదిపేసిన ముంబై ఉగ్రదాడి జరిగి 18 ఏళ్లు పూర్తయ్యాయి. 2008 నవంబర్ 26 రాత్రి సముద్ర మార్గం ద్వారా ముంబై నగరంలోకి చొరబడిన పది మంది ఉగ్రవాదులు భీకర దాడులకు తెగబడ్డారు. ఈ నరమేధంలో 166 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా ఆనాటి దాడిలో మరణించిన అమాయకులకు, ఉగ్రవాదులను ధైర్యంగా ఎదుర్కొని ప్రాణాలు విడిచిన భద్రతా సిబ్బందికి విదేశాంగ మంత్రి జైశంకర్ నివాళులర్పించారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో పూర్తిగా అణచివేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

నవంబర్ 26 విషాద ఘటన మిగిల్చిన గాయాలు ఇప్పటికీ ముంబై నగరవాసులను వెంటాడుతూనే ఉన్నాయి. తాజ్ హోటల్, ఒబెరాయ్ హోటల్, ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్, నారిమన్ హౌస్‌లో మూడు రోజుల పాటు జరిగిన కాల్పుల తాలూకు తూటాల గుర్తులు నేటికీ సజీవంగా ఉన్నాయి. ఉగ్రవాది కసబ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ తుకారాం ఓంబ్లే విగ్రహం, ముంబై వీధులు ఆ దారుణ దాడులను నిత్యం గుర్తుచేస్తూనే ఉంటాయి. ఈ ఘటనలో తొమ్మిది మంది ఉగ్రవాదులు హతమవ్వగా, కసబ్‌ను భద్రతా దళాలు పట్టుకున్నాయి. 2010 మేలో న్యాయస్థానం కసబ్‌కు మరణశిక్ష విధించగా, అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య 2012లో అతడిని ఉరితీశారు.

ఈసీఆర్ఎఫ్ పనులపై పీపీఏ సీఈఓ తనిఖీ

పీఎం-సేతు పటిష్ట అమలుతో యువతకు మెరుగైన ఉపాధి





- పోలవరంలో 1.5 కి.మీ. మేర కాలినడకన పరిశీలన
- నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడొద్దని సంజీవ్ వోహ్రా ఆదేశం
- మట్టి నమూనాలను పరిశీలించిన సీఎస్ఎంఆర్ఎస్ నిపుణులు

పోలవరం, నవంబర్ 26 (సమయం న్యూస్) : పోలవరం ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణ పనుల నాణ్యతను పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు మూడు గంటల పాటు నిర్మాణ ప్రాంతంలో పర్యటించి, దాదాపు 1.5 కిలోమీటర్ల మేర కాలినడకన పనులను తనిఖీ చేశారు. మట్టి, రాయి, ఇసుక నింపకం, పొరల పటిష్ఠత, తేమ శాతం తదితర అంశాలను పరిశీలించడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అప్పటికప్పుడు తవ్వకాలు చేపట్టి గట్టిదనాన్ని పరీక్షించారు. అనంతరం తిరిగి నింపి షీప్‌ఫుట్ రోలర్‌తో పటిష్ఠతను తనిఖీ చేశారు. పరీక్షల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సీఈఓ సూచించారు. భూగర్భ జలాల ఊట, మట్టి తేమ శాతాన్ని గుర్తించే పరికరాల పనితీరును కూడా ఆయన పరిశీలించారు. ఇదిలా ఉండగా, కేంద్ర మృత్తిక, పదార్థాల పరిశోధన కేంద్రం (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణులు మూడు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. పైడిపాక, గ్యాప్ఉ3 ప్రాంతాల్లో నిల్వ చేసిన మట్టి నమూనాలను పరిశీలించి, మరింత విశ్లేషణ కోసం కొన్ని నమూనాలను తమ కేంద్రానికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయి పరీక్షలు సంతృప్తికరంగా సాగాయని నిపుణులు తెలిపారు.

అఖిలేశ్ ఆరు నెలలు జైలుకెళ్తే ఆ బాధేంటో తెలిసేది!

- ఎస్పీ అధినేత సమక్షంలోనే ఆజం ఖాన్ సంచలన వ్యాఖ్యలు
- ఐదున్నరేళ్ల జైలు జీవితం నన్ను కుంగదీసిందని ఆవేదన
- కొడుకుతో వేర్వేరు వాహనాల్లో తరలించిన ఘటన మర్చిపోలేను
- ప్రభుత్వం, ఈడీ తీవ్రంగా వేధించాయని మండిపాటు



లక్నో నవంబర్ 26 (సమయం న్యూస్): సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీనియర్ నేత ఆజం ఖాన్ మరోసారి తన జైలు జీవితాన్ని తలచుకుని భావోద్వేగానికి లోనయ్యారు. పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సమక్షంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అఖిలేశ్ యాదవ్ కూడా ఆరు నెలల పాటు జైలులో ఉంటే అక్కడి బాధలు ఆయనకు తెలిసేవని తన కుమారుడితో అంటుండేవాడినని చెప్పారు. ఐదున్నరేళ్ల జైలు జీవితం తన శరీరం, మనసుపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఆజం ఖాన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన జైలు అనుభవాలను ఆయన సభ ముందుంచారు. "ఒకసారి జైలు నుంచి మరో ప్రాంతానికి తరలించే సమయంలో నన్ను, నా కుమారుడు అబ్దుల్లాను వేర్వేరు వాహనాల్లో తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మమ్మల్ని వేర్వేరుగా ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించినా అధికారులు సమాధానం చెప్పలేదు. అప్పుడు అబ్దుల్లాతో.. ఇదే మన చివరి కలయిక కావచ్చని చెప్పా. ఇక్కడ మళ్లీ కలవకపోతే మరో లోకంలో కలుసుకుందామని అన్నాను. ఈ ఘటన నా జీవితంలో మర్చిపోలేని బాధాకరమైన అనుభవం" అని ఆజం ఖాన్ వివరించారు.

"ఐదున్నరేళ్ల జైలు జీవితం నన్ను మానసికంగా, శారీరకంగా తీవ్రంగా కుంగదీసింది. నా భార్య, కుమారుడు కూడా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. ఒకవేళ అఖిలేశ్ యాదవ్ కూడా జైలుకు వస్తే.. ఇక్కడ ఎలా ఉంటారు? రాత్రులు ఎలా గడుస్తాయి? ఎదురయ్యే పరిస్థితులు ఏమిటి? అన్నది స్వయంగా తెలుసుకునేవారని అనుకునేవాడిని. నన్ను, నా కుటుంబాన్ని ప్రభుత్వం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వంటి దర్యాప్తు సంస్థలు తీవ్రంగా వేధించాయి" అని ఆజం ఖాన్ పేర్కొన్నారు.

అహంకారం వీడి కలిసి పనిచేయండి!

యూపీలో సీట్ల పంపకాల వివాదం వేళ ఖర్గే కీలక వ్యాఖ్యలు

ఎంపీ ఇమ్రాన్ మసూద్‌కు పరోక్షంగా చురకలు

టీవీల్లో మాటల కంటే క్షేత్రస్థాయి పనికే ప్రాధాన్యమివ్వాలి

బీజేపీని ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాల ఐక్యతే మంత్రం

లక్నో నవంబర్ 26 (సమయం న్యూస్) : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మధ్య సీట్ల పంపకాల వ్యవహారం ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. ఇరు పార్టీల మధ్య విభేదాలు కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌ను ఉద్దేశించి పరోక్షంగా చురకలు అంటించిన ఆయన.. నాయకులంతా అహంకారాన్ని వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నవంబర్ 26న లక్నోలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సభలో ఖర్గే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ నేతలను ఒక్కొక్కరినీ ప్రస్తావిస్తూ ఇమ్రాన్ మసూద్ గురించి మాట్లాడారు. ఇమ్రాన్ మసూద్ టీవీల్లో తరచూ కనిపిస్తారని, ఎంతో ఉత్సాహంగా తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటారని అన్నారు. అయితే మాటల కంటే పనికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాయకులంతా కలిసి పనిచేస్తేనే పార్టీ మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో పార్లమెంటులో ఇమ్రాన్ మసూద్ పార్టీ తరఫున గట్టిగా తన వాణిని వినిపిస్తున్నారని, కాంగ్రెస్ వైఖరిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు.

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాలు ఐక్యంగా ఉండాలని ఖర్గే స్పష్టం చేశారు. విజయం సాధించాలంటే అంతర్గత విభేదాలకు తావివ్వకూడదని, నాయకులు అహంకారాన్ని పక్కనపెట్టి కలిసి పనిచేయాలని సూచించారు. కాగా, సమాజ్‌వాదీ పార్టీతో సీట్ల పంపకాల చర్చలపై ఇమ్రాన్ మసూద్ కొద్ది రోజులుగా బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'మేము మీ పొత్తు భాగస్వాములమా? లేక మీ సేవకులమా?' అంటూ ఎస్పీ నాయకత్వాన్ని నిలదీశారు. ఈ నేపథ్యంలో ఖర్గే చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నిరుద్యోగులకు రూ.5 వేల భృతి.. రూ.5కే భోజనం

'జన్‌ఉమన్ కా మేనిఫెస్టో' విడుదల చేసిన సమాజ్‌వాదీ పార్టీ

ఆరేళ్లలో 25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు.. కులగణనకు హామీ

వృద్ధ మహిళలకు ఏటా రూ.40 వేల పెన్షన్ ఇస్తామన్న అఖిలేశ్

లక్నో, నవంబర్ 26 (సమయం న్యూస్) : వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఉద్యోగ కల్పన, సామాజిక సంక్షేమం, ఆర్థిక భద్రత వంటి అంశాలకు పెద్దపీట వేస్తూ ఈ హామీల పత్రాన్ని రూపొందించింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విడుదల చేసిన ఈ మేనిఫెస్టోకు 'జన్‌ఉమన్ కా మేనిఫెస్టో' అని నామకరణం చేసింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రజలకు పలు కీలక వాగ్దానాలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులందరికీ ప్రతినెలా రూ.5,000 భృతి అందిస్తామని, ఆరేళ్లలో 25 లక్షల మంది యువతీయువకులకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు 2 నుంచి 3 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలో కులగణన నిర్వహిస్తామని చెప్పారు. యూపీ వ్యాప్తంగా సమాజ్‌వాదీ క్యాంటీన్లను తెరిచి, వాటి ద్వారా రూ.5కే భోజనం అందిస్తామని వివరించారు. వయసు పైబడిన మహిళలకు ఏటా రూ.40,000 వార్షిక పెన్షన్ ఇస్తామని భరోసా కల్పించారు. మేనిఫెస్టో విడుదల కోసం రాజ్యాంగ దినోత్సవాన్ని ఎందుకు ఎంచుకున్నారో అఖిలేశ్ యాదవ్ వివరించారు. "గతంలో మంచి రోజులు (అచ్చే దిన్) వస్తాయని బీజేపీ ప్రజలను మోసం చేసింది. కానీ అవి ఇప్పటికీ రాలేదు. అందుకే వారిని గద్దె దించేందుకు మనం రాజ్యాంగ దినోత్సవం రోజున సమావేశమయ్యాం. ఇవాళే మన మేనిఫెస్టోను విడుదల చేశాం" అని ఆయన పేర్కొన్నారు.





గాయత్రి జోడీ శుభారంభం

లక్నో: సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. మహిళల డబుల్స్ లో డిఫెండింగ్ చాంపియన్ పుల్లెల గాయత్రి - ట్రీసా జాలీ తొలి రౌండ్‌లో 21-8, 21-7తో రష్మి గణేశ్-అమృత ప్రముతేశ్ ను ఓడించింది. సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అష్మిత చాలిహా, తన్వీ శర్మ, తన్య హేమంత్ కూడా రెండో రౌండ్‌కు చేరారు. మూడో సీడ్ ఉన్నతి 21-15, 21-19తో కాంటెమిర్ (ఉక్రెయిన్)పై , ఐదో సీడ్ అష్మిత 21-14, 21-16తో పోలినా బుహ్రోవా (ఉక్రెయిన్) పై గెలిచారు. పురుషుల సింగిల్స్ లో తుషార్ సువీర్ 21-11, 21-17తో ఐదో సీడ్ జస్టిన్ హో (మలేసియా) పై నెగ్గగా, తెలంగాణ షట్లర్ తరుణ్ 22-23, 11-21తో హువాంగ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడిపోయాడు.



భారత్ పాంచ్ పటాకా

భోపాల్: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత జట్టు జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 4-0తో జపాన్‌ను ఓడించిన భారత్ వరుసగా ఐదో విజయంతో 15 పాయింట్లు సాధించి పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఆతిథ్య జట్టు తరఫున దీపిక 16వ, 48వ నిమిషాల్లో డబుల్ గోల్స్‌తో సత్తా చాటింది. లాల్‌రెమ్‌సియామి (12వ ని), నేహా (28వ ని) చెరో గోల్ చేశారు. ఈ విజయంతో ప్రపంచ ర్యాంకింగ్స్ లో భారత్ అత్యుత్తమంగా నాలుగో స్థానానికి చేరుకుంది.

రెండో టెస్టుకూ సిరాజ్ దూరమేనా?

ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): టీమ్‌ఇండియా సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు మరోసారి నిరాశ తప్పేలా లేదు. న్యూజిలాండ్‌తో రెండో టెస్టులోనూ అతడికి తుది జట్టులో చోటు దక్కడం అనుమానంగానే కనిపిస్తోంది. తొలి టెస్టుకు దూరమైన సిరాజ్.. రెండో టెస్టుకూ బెంచ్‌కే పరిమితం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు అందుకు సంకేతాలిస్తున్నాయి. సిరాజ్ ప్రపంచస్థాయి బౌలర్ అని ప్రశంసించిన మోర్కెల్.. తిరిగి జట్టులోకి రావడానికి తన ఆటను సమీక్షించుకుని, మెరుగుపడాల్సిన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించాడు. రెండో టెస్టులో భారత తుది జట్టులో ఒక మార్పు జరిగే అవకాశముంది. తొలి టెస్టులో ఆశించిన స్థాయిలో రాణించని ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు చోటు దక్కవచ్చని తెలుస్తోంది. క్రైస్ట్‌చర్చ్ మైదానం పేసర్లకు అనుకూలించే అవకాశముండటంతో.. ఎత్తుగా ఉండే గుర్నూర్ బౌన్స్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగలడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతడు అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నాడని మోర్కెల్ కూడా పేర్కొన్నాడు. వెలింగ్టన్ పిచ్‌పై పచ్చిక(గ్రాస్) ఎక్కువగా ఉండటంతో బంతి బౌన్స్ అవుతుందని భారత జట్టు భావించింది. కానీ, మ్యాచ్‌లో అలాంటి పరిస్థితులు కనిపించలేదని మోర్కెల్ వివరించాడు. న్యూజిలాండ్ బౌలర్ల వేగం కూడా ఆ పిచ్‌పై తగ్గిందని, భారత బౌలర్లనే ప్రత్యేకంగా తప్పుబట్టలేమని పేర్కొన్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లోనైనా బౌలర్లు మెరుగైన ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందిస్తారని టీమ్‌ఇండియా ఆశిస్తోంది.



ముంబై ఇండియన్స్ ప్రతిపాదనకు రాజస్థాన్ నిరాకరణ

హార్దిక్ కోసం జైస్వాల్, ఆర్చర్‌ను అడిగిన ముంబై!

- ఇద్దరు కీలక ఆటగాళ్లను వదులుకునేందుకు విముఖత
- మధ్యలోనే నిలిచిపోయిన హార్దిక్ బదిలీ చర్చలు





ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడ్ వ్యవహారం మరోసారి ఆసక్తికరంగా మారింది. ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్ కోసం అంతకుముందు రాజస్థాన్ రాయల్స్ కూడా తీవ్రంగా ప్రయత్నించినట్లు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. అయితే ముంబై ఇండియన్స్ పెట్టిన డిమాండ్లకు రాజస్థాన్ అంగీకరించకపోవడంతో ఈ డీల్ మధ్యలోనే ఆగిపోయినట్లు తెలుస్తోంది. 2027 ఐపీఎల్ రిటెన్షన్ గడువుకు ముందు హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ వంటి ఫ్రాంచైజీల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు పంజాబ్ కింగ్స్ అతడిని సొంతం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు వెళ్లాడు. అయితే హార్దిక్ కోసం రాజస్థాన్ చేసిన ప్రయత్నం ఎందుకు విఫలమైందనే డీటెయిల్స్ తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఓ జాతీయ మీడియా కథనం ప్రకారం.. పాండ్యాను ఇచ్చేందుకు రాజస్థాన్ ముందు ముంబై భారీ ప్రతిపాదన ఉంచిందట. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను కూడా ట్రేడ్‌లో భాగంగా ఇవ్వాలని ముంబై కోరినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరు కీలక ఆటగాళ్లను వదులుకోవడానికి రాజస్థాన్ యాజమాన్యం ఇష్టపడలేదు. దీంతో ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లలేదట. హార్దిక్ పాండ్యాను దక్కించుకోలేకపోయినప్పటికీ రాజస్థాన్ రాయల్స్ మరో కీలక ట్రేడ్ డీల్‌ను పూర్తి చేసింది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌కు పంపించి.. ప్రతిగా భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ, స్పిన్నర్ మనీమారన్ సిద్ధార్థ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ ఒప్పందంలో షమీని లక్నో గతంలో రూ.10 కోట్లకు కొనుగోలు చేయగా.. రాజస్థాన్‌కు మారే సమయంలో అతడి ధరను రూ.8 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. లెఫ్టార్మ్ స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ తన ప్రస్తుత ధర రూ.75 లక్షలకే రాజస్థాన్‌కు మారనున్నాడు. మరోవైపు సామ్ కరన్ రూ.2.4 కోట్ల ప్రస్తుత ధరతో లక్నో సూపర్ జెయింట్స్‌కు వెళ్లనున్నాడు.మహమ్మద్ షమీ రాకతో రాజస్థాన్ రాయల్స్ పేస్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. ఇప్పటికే జోఫ్రా ఆర్చర్ వంటి ప్రపంచస్థాయి బౌలర్ జట్టులో ఉండటంతో.. కొత్త బంతితో వీరిద్దరూ ప్రత్యర్థి బ్యాటర్లకు సవాళ్లు విసిరే అవకాశం ఉంది. 2024 సీజన్‌లో రాజస్థాన్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆర్చర్ నిలిచాడు. మరోవైపు షమీకి ఐపీఎల్‌లో మంచి అనుభవం ఉంది. ఇప్పటివరకు 132 మ్యాచ్‌లు ఆడి 145 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయగల సామర్థ్యం, అంతర్జాతీయ అనుభవం రాజస్థాన్‌కు ఉపయోగపడనున్నాయి. ఇప్పుడు షమీ, ఆర్చర్ జోడీ ఎలా రాణిస్తుందన్నది ఐపీఎల్ 2027లో ఆసక్తికరంగా మారనుంది.

రెండో టెస్టులో గూర్నూర్?

శుక్రవారం నుంచి భారత్--న్యూజిలాండ్ రెండో టెస్టు

- క్రైస్ట్‌చర్చ్ వేదికగా కీలక పోరు
- భారత తుది జట్టులో మార్పులకు అవకాశం
- ప్రసిధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్‌లలో ఒకరిపై వేటు?
- గూర్నూర్ బౌలింగ్‌పై మోర్నీ మోర్కెల్ ప్రశంసలు

క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 26 (సమయం న్యూస్): రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి న్యూజిలాండ్, భారత్ మధ్య రెండో టెస్టు ఆరంభం కానుంది. ఈ టెస్టుకు టీమిండియా తుది జట్టులో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. యువ ఫాస్ట్ బౌలర్ గూర్నూర్ బ్రార్‌కు టెస్టు అరంగేట్రం చేసే ఛాన్సెస్ మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. క్రైస్ట్‌చర్చ్‌లోని హ్యాగ్లీ ఓవల్ పిచ్ పరిస్థితులకు గూర్నూర్ బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గూర్నూర్ బ్రార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడి వేగం, బౌన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండో టెస్టుకు ముందు మీడియాతో మాట్లాడిన మోర్నీ మోర్కెల్.. 'భారత జట్టులోకి వచ్చినప్పటి నుంచి గూర్నూర్ గురించి ఎంతో ఆసక్తి నెలకొంది. అతడి వేగం, బౌన్స్ చాలా బాగున్నాయి. ఇక్కడి పరిస్థితులకు అతడు చక్కగా సరిపోతాడని భావిస్తున్నాను. ఏం జరుగుతుందో చూద్దాం' అని చెప్పాడు. గూర్నూర్ జట్టులోకి వస్తే.. అన్షుల్ కంబోజ్ లేదా ప్రసిధ్ కృష్ణలలో ఒకరిపై వేటు పడనుంది. గూర్నూర్ బ్రార్ టెస్టు జట్టులో చోటు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాడని మోర్కెల్ తెలిపాడు. 'గూర్నూర్ టెస్టు జట్టులోకి వచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు. అన్ని విషయాల్లోనూ సరైన మార్గంలోనే వెళ్తున్నాడు. అయితే ఆటగాడిగా తుది జట్టు ఎంపిక మన చేతుల్లో ఉండదు. అవకాశం వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకునేలా సిద్ధంగా ఉండాలి. అరంగేట్రానికి దగ్గరగా ఉన్నప్పుడు కొంతమంది బౌలర్లు ఒత్తిడికి గురవుతారు. అతడికి అవకాశం ఎప్పుడు వస్తుందో చెప్పలేం. కానీ ఆ సమయానికి అతడు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా చూడటం నా బాధ్యత' అని వివరించాడు. రెండో టెస్టు జరగనున్న హ్యాగ్లీ ఓవల్ పిచ్‌పై కూడా మోర్కెల్ స్పందించాడు. మైదానంలో పిచ్‌పై ఎక్కువ మొత్తంలో పచ్చిక కనిపిస్తోందని, అయితే అది మ్యాచ్‌లో ఎలా స్పందిస్తుందో చూడాలని తెలిపాడు. 'నేను చూసినంతవరకు పిచ్‌పై ఎక్కువ పచ్చిక ఉంది. గత మ్యాచ్‌కు ముందు కూడా పిచ్‌పై మంచి బౌన్స్, వేగం ఉంటాయని భావించాం. కానీ మ్యాచ్‌లో పరిస్థితులు అలా లేవు. కాబట్టి పిచ్ ఎలా ఉంటుందో మనం ఇప్పుడే చెప్పలేం. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ఆడటమే ముఖ్యం' అని పేర్కొన్నాడు. యువ పేసర్ అన్షుల్ కంబోజ్ ప్రదర్శనపైనా మోర్కెల్ స్పందించాడు. గత ఏడాది ఇంగ్లండ్ పర్యటనలో ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా టెస్టు అరంగేట్రం చేసిన కంబోజ్.. తొలి మ్యాచ్‌లో 18 ఓవర్లు బౌలింగ్ చేసి 89 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టులో కొత్త బంతితో వికెట్ సాధించడంతో పాటు నైట్‌వాచ్‌మన్‌గా 38 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అయితే తొలి టెస్టు ప్రదర్శన ఆధారంగా కంబోజ్‌ను అంచనా వేయకూడదని మోర్కెల్ సూచించాడు. 'అది కేవలం అన్షుల్ విషయంలోనే కాదు. న్యూజిలాండ్ బౌలర్లు కూడా ఆ పిచ్‌పై తక్కువ వేగంతో బౌలింగ్ చేశారు. ఒక ఆటగాడిని అతడి తొలి టెస్టుతోనే అంచనా వేయడం సరికాదు. తొలి మ్యాచ్ ఆడేటప్పుడు ఆటగాళ్లలో ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. జట్టు కోసం కఠిన ఓవర్లు వేస్తున్న అతడికి మనం మద్దతుగా నిలవాలి. రెండు మూడు మ్యాచ్‌లు ఆడిన తర్వాత అతడి ప్రదర్శనపై చర్చించవచ్చు. ఇప్పుడే ఒక అభిప్రాయానికి రావడం తొందరపాటు అవుతుంది' అని స్పష్టం చేశాడు. రెండో టెస్ట్‌కు భారత తుది జట్టు (అంచనా)లో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (కీపర్), ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్, ప్రసిధ్ కృష్ణ లేదా గుర్నూర్ బ్రార్ ఉన్నారు.





సారా అర్జున్‌కు బాలీవుడ్‌లో బంపర్ ఆఫర్!

రామ్‌చరణ్ చిత్రంలోనూ సారాకు అవకాశం?

ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): 'ధురంధర్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న యువ నటి సారా అర్జున్‌కు బాలీవుడ్‌లో మరో భారీ అవకాశం దక్కినట్లు ప్రచారం జరుగుతోంది. కథానాయికగా తొలి అడుగులోనే భారీ విజయాన్ని అందుకున్న సారా తదుపరి చిత్రాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. 'ధురంధర్ 2' విడుదలై ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఆమె కొత్త చిత్రానికి సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందించనున్న సంగీత ప్రధాన ప్రేమకథా చిత్రంలో సారాను కథానాయికగా ఎంపిక చేసినట్లు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఈ సంస్థ మరో ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోందట. ఇందులో అంబరీష్ వర్మ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. మనీష్ శర్మ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి ప్రస్తుతం నిర్మాణ పూర్వ పనులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభించే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు ప్రముఖ నటి మధుబాల జీవితకథ ఆధారంగా తెరకెక్కనున్న చిత్రంలోనూ సారా పేరు వినిపిస్తోంది. తెలుగులో 'యుఫోరియా' చిత్రంలో నటించిన ఆమెకు రామ్‌చరణ్ తదుపరి చిత్రం 'ఆర్సీ17'లో కథానాయికగా అవకాశం దక్కే సూచనలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం సారా అర్జున్, సాత్విక వీరవల్లా పేర్లను చిత్రబృందం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ చిత్రాల్లో సారా ఎంపికకు సంబంధించి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది.

పాక్ కంటెంట్‌కు భారత్‌లో కత్తెర!

- నెట్‌ఫ్లిక్స్‌కు కేంద్ర సమాచార, ప్రసార శాఖ కీలక ఆదేశాలు
- పాకిస్థాన్ సినిమాలు, వెబ్ సిరీస్‌లను నిలిపివేయాలని సూచన
- జాతీయ భద్రత దృష్ట్యా గత మార్గదర్శకాలను పాటించాలని స్పష్టీకరణ
- పాకిస్థానీ వెబ్ సిరీస్ విడుదల నేపథ్యంలో వివాదం
- బెంగళూరులో పాక్ డ్రామా ప్రత్యేక ప్రదర్శనలు రద్దు



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): భారత్‌లో పాకిస్థాన్‌కు చెందిన సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర డిజిటల్ వినోద కార్యక్రమాలు అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌ను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశించినట్లు సమాచారం. నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన తొలి పాకిస్థానీ ఒరిజినల్ వెబ్ సిరీస్ 'జో బచే హై సంగ్ సమేట్ లో' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. సదరు సిరీస్‌ను భారత్‌లోనూ విడుదల చేసే అవకాశాలున్నాయంటూ పలు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందడంతో కేంద్రం స్పందించినట్లు తెలుస్తోంది. 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా అదే ఏడాది మే 8న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓటీటీ సంస్థలు, డిజిటల్ ప్రసార వేదికలు పాకిస్థాన్ మూలాలున్న వినోద కార్యక్రమాలను నిలిపివేయాలని సూచించింది. సమాచార సాంకేతిక నిబంధనలు--2021 ప్రకారం దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, జాతీయ భద్రత, విదేశీ సంబంధాలు, ప్రజాశాంతికి విఘాతం కలిగించే ప్రసారాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొంది. భారతీయ ప్రేక్షకులకు పాకిస్థాన్ సినిమాలు, సిరీస్‌లు అందుబాటులో ఉంచబోమని 2025 జూన్‌లో నెట్‌ఫ్లిక్స్ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినట్లు సమాచారం. ఆ హామీకి కట్టుబడి ఉండాలని కేంద్రం తాజాగా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు బెంగళూరులో పాకిస్థానీ టీవీ డ్రామా 'దార్-ఏ-నిజాత్' ప్రత్యేక ప్రదర్శనల వ్యవహారం వివాదాస్పదమైంది. నవంబర్ 28న ఫ్రేజర్ టౌన్‌లోని ఓ రెస్టారెంట్‌లో, డిసెంబర్ 5న జయమహల్ ఎక్స్‌టెన్షన్‌లోని ప్రైవేటు థియేటర్‌లో ఈ ప్రదర్శనలను నిర్వహించేందుకు రెండు వేర్వేరు సంస్థలు ఏర్పాట్లు చేశాయి. కార్యక్రమాలకు హాజరయ్యేవారు పాకిస్థానీ సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఆహ్వాన పత్రికల్లో పేర్కొనడంపై సామాజిక మాధ్యమాల్లో పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. బెంగళూరు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోలేదని బెంగళూరు పోలీస్ కమిషనర్ ఆర్.హితేంద్ర వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలపై పోలీసులు నిర్వాహకులను సంప్రదించి వివరాలు సేకరించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన వ్యతిరేకత, పోలీసుల విచారణ నేపథ్యంలో రెండు ప్రదర్శనలను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల కోసం ఏర్పాటు చేసుకున్న కార్యక్రమం వివాదాస్పదం కావడంతో రద్దు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు ప్రదర్శనల రద్దును పులకేశినగర్ పోలీసులు ధ్రువీకరించారు.

'నంది' అవార్డులకు గ్రీన్ సిగ్నల్!



అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్): తెలుగు సినీ, టెలివిజన్, నాటక రంగాల కళాకారుల సుదీర్ఘ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ప్రతిష్టాత్మక 'నంది' అవార్డుల ప్రదానంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమరావతి నుంచి తాజాగా వెలువడిన ఉత్తర్వులతో టాలీవుడ్‌తో పాటు బుల్లితెర, రంగస్థల కళాకారుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నంది పురస్కారాల విషయంలో ప్రభుత్వం వేగం పెంచి, ఏకంగా 2017 నుంచి 2025 వరకు అంటే తొమ్మిదేళ్ల కాలానికి సంబంధించిన అవార్డులను ఒకేసారి అందించేందుకు రంగం సిద్ధమైంది. సినిమా, టెలివిజన్, నాటక రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం ప్రకటనతోనే సరిపెట్టకుండా, వచ్చే నెల అంటే డిసెంబర్‌లోనే నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. ఈ ప్రతిష్టాత్మక వేడుకను విజయవాడలో గానీ, లేదా రాజధాని అమరావతిలో గానీ అట్టహాసంగా నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత నంది అవార్డుల సందడి మళ్ళీ మొదలవుతుండటంతో, 2017 నుంచి 2025 మధ్య వచ్చిన ఏయే చిత్రాలు, ఏయే నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ గౌరవాన్ని దక్కించుకుంటారనే ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో జోరుగా చర్చనీయాంశమైంది. మొత్తానికి, డిసెంబర్‌లో తెలుగు కళాకారులందరికీ ఇదొక నిజమైన పండగ కాబోతోంది.

బన్నీ 25వ చిత్రానికి దర్శకుడెవరు?

తదుపరి చిత్రాలపై అల్లు అర్జున్ భారీ ప్రణాళికలు

హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): 'పుష్ప 2' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాల విషయంలో భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంతో తన స్థాయిని మరింత పెంచుకోవాలని భావిస్తున్నారు. చిత్ర నిర్మాణానికి ఎంత సమయం పట్టినా నాణ్యత విషయంలో రాజీపడకూడదనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు విడుదల తేదీని ప్రకటించకపోవడంతో ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? లేక 2028 వరకు వేచి చూడాల్సిందేనా? అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. 'రాకా' చిత్రంతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ తదుపరి చిత్రాలపైనా బన్నీ దృష్టి సారించారు. ఇప్పటికే ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో సినిమా చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. మరోవైపు 'సరైనోడు' చిత్రంతో భారీ విజయాన్ని అందించిన బోయపాటి శ్రీనుతో మరోసారి జతకట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బోయపాటి చెప్పిన కథను ఇప్పటికే విన్నారని, చిత్రాన్ని ఖరారు చేయడమే మిగిలిందని తెలుస్తోంది. మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ కూడా అల్లు అర్జున్ తదుపరి చిత్రాల దర్శకుల జాబితాలో ఉన్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది వీరిద్దరి కలయికలో సినిమా ప్రారంభమయ్యే అవకాశముందట. మరోవైపు ఓ బాలీవుడ్ దర్శకుడితోనూ బన్నీ సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తన సినీ ప్రస్థానంలో మైలురాయిగా నిలిచే 25వ చిత్రాన్ని అల్లు అర్జున్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది సినీవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. 'రాకా' అనంతరం లోకేశ్ కనగరాజ్, బోయపాటి శ్రీను, బాసిల్ జోసెఫ్‌లలో ఎవరితో ముందుగా సినిమా చేస్తారన్నది అధికారిక ప్రకటనతోనే తేలనుంది.



'రామాయణ' చిత్రబృందంపై అమిత్‌షా ప్రశంసలు!



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కిన భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' చిత్రబృందంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించినట్లు సమాచారం. గురువారం న్యూఢిల్లీలో అమిత్ షాతో కథానాయకుడు రణబీర్ కపూర్, కథానాయిక సాయిపల్లవి, దర్శకుడు నితేశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రా, సహ నిర్మాత నీరజ్ సంఘాయ్ సమావేశమయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రామాయణ ఇతిహాసాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో వెండితెరపై ఆవిష్కరించినందుకు చిత్రబృందాన్ని అమిత్ షా అభినందించినట్లు తెలుస్తోంది. రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అద్భుతమైన దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలు, ఆకట్టుకునే కథనంతో దేశవిదేశాల్లో ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.1,755 కోట్లకు పైగా స్థూల వసూళ్లు సాధించినట్లు సినీ వాణిజ్య వర్గాలు వెల్లడిస్తున్నాయి. రూ.1,742 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించిన 'పుష్ప 2'ను ఈ చిత్రం అధిగమించినట్లు ప్రచారం జరుగుతోంది. భారీ వసూళ్లతోపాటు అంతర్జాతీయ పురస్కారాల వేదికపైనా 'రామాయణ' సత్తా చాటుతున్నట్లు సమాచారం. 2027 ఆస్కార్ పురస్కారాలకు సంబంధించి ఉత్తమ దృశ్య ప్రభావాల విభాగంలో పరిశీలనకు ఎంపికైన 20 చిత్రాల జాబితాలో 'రామాయణ'కు చోటు దక్కినట్లు తెలుస్తోంది. భారతీయ పౌరాణిక చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మరింత ఆదరణ పెరిగేందుకు ఈ విజయం దోహదపడుతుందనే అభిప్రాయాలు సినీవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**